# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :210 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది:గురువారం 24-10-2024 | పేజీలు:4 వెల: 2.00


### వైకాపా తీరుపై సోమిరెడ్డి ఆగ్రహం

నెల్లూరు, వైసీపీ నేతలు మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి హెచ్చరించారు. చిల్లకూరు మండలం నాంచారం పేటలో వైసీపీ వర్గీయులు టీడీపీ కార్యకర్త మల్లారపు హరిప్రసాద్‌పై దాడి చేసి హత్య చేశారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీలో ఉన్న హరిప్రసాద్ మృతదేహాన్ని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన వారిలో సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, తిరుపతి పార్లమెంట్ నియోజక వర్గం టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ ఉన్నారు. మృతుని కుటుంబ సభ్యులకు టీడీపీ నేతలు పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డి మాట్లాడుతూ... వైసీపీ మూకలు టీడీపీ కార్యకర్త హరిప్రసాద్‌పై బీరు బాటిళ్లతో పెట్రోల్ పోసి, దాడి చేసి దారుణంగా హత్య చేయడం దారుణమని అన్నారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి ఐదేళ్లు సర్వనాశనం చేసి ప్యాలెస్‌లో శాంతి వచనాలు చెబుతున్నారని మండిపడ్డారు.

## దేశంలో ఇద్దరు ఎంపీలున్న ఏకైక నియోజకవర్గం వాయనాడ్ : రాహుల్‌గాంధీ




దేశంలో ఇద్దరు ఎంపీలు ఉన్న ఏకైక లోక్‌సభ నియోజకవర్గం వాయనాడ్ అని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ అన్నారు. వాయనాడ్‌లో ప్రియాంకాగాంధీ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనడం కోసం మంగళవారం రాత్రే తన సోదరితోపాటు రాహుల్‌గాంధీ వాయనాడ్‌కు చేరుకున్నారు. ఇవాళ నియోజకవర్గంలోని కల్పెట్టలో ప్రియాంకతో కలిసి రోడ్ షోలో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. దేశంలో ఏ లోక్‌సభ స్థానానికైనా ఒకరే ఎంపీ ఉంటారని, కానీ వాయనాడ్‌కు మాత్రం ఇద్దరు ఎంపీలు ఉంటారని రాహుల్‌గాంధీ చెప్పారు. ప్రియాంకాగాంధీ అధికారిక ఎంపీగా ఉంటే, తాను అనధికారిక ఎంపీగా కొనసాగుతానని అన్నారు. ఇద్దరం కలిసి వాయనాడ్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ర్యాలీలో ప్రియాంకాగాంధీ, రాహుల్‌గాంధీతోపాటు కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షురాలు సోనియాగాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తదితరులు కూడా పాల్గొన్నారు.

ప్రియాంకాగాంధీ మరికాసేపట్లో వాయనాడ్ కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. మల్లికార్జున్ ఖర్గే, సోనియగాంధీ, రాహుల్‌గాంధీ సమక్షంలో ఆమె ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను సమర్పించనున్నారు. కాగా వాయనాడ్ లోక్‌సభ స్థానానికి నవంబర్ 20న పోలింగ్ జరగనుంది. నవంబర్ 23న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు.

## మూడో రోజుకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు..



హైదరాబాద్: తీవ్ర వ్యతిరేకత, ఉద్రిక్తతల నడుమ ప్రారంభమైన గ్రూప్-1 మెయిన్స్ (%+తీశీబజూ-1 మీఖఅఅం%) పరీక్షలు మూడోరోజుకు చేరుకున్నాయి. రెండు రోజులు ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు.. బుధవారం పేపర్-2 (హిస్టర్, కల్చర్, జాగ్రఫీ) పరీక్ష జరుగనుంది. తొలిరోజు జనరల్ ఇంగ్లిష్ పరీక్షకు 31,383 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇక రెండోరోజైన మంగళవారం జరిగిన జనరల్ ఎస్సే పేపర్‌కు 31,383 మంది అభ్యర్థులకుగాను 21,817 (69.4శాతం) హాజరయ్యారు. 10 వేల మంది దుమ్మాకొట్టడం గమనార్హం.అభ్యర్థులను మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష హాలులోకి అనుమతించాలని అధికారులు స్పష్టం చేశారు. కాగా, హైదరాబాద్‌లో 5 వేల 613 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 87.23 శాతం మందికి గాను 4 వేల 896 మంది అభ్యర్థులు మాత్రమే పరీక్ష రాశారు. మరో 717 మంది గైర్హాజరయ్యారు. రంగారెడ్డి పరిధిలో 8 వేల 11 మందికి గాను 5 వేల 854 మంది పరీక్ష రాశారు. మరో 2 వేల 157 మంది పరీక్షకు హాజరు కాలేదు. ఈ నెల 27 వరకు గ్రూప్ 1 మెయిన్స్ కొనసాగనున్నాయి. అయితే గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలో మూడు ప్రశ్నల్లో అక్షర దోషాలు, అచ్చుతప్పులు దొర్లాయి. వ్యాసరూప ప్రశ్నలు కావడంతో సమాధానాలు రాసేందుకు అభ్యర్థులు ఇబ్బందులు పడ్డారు. ప్రశ్నలు కఠినంగా ఉన్నట్టు కొందరు తెలుపగా, మరికొందరు మాత్రం సులభంగా ఉన్నట్టు తెలిపారు. ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 పేపర్ తరహాలోనే ప్రశ్నలు ఉన్నట్టు నిపుణులు విశ్లేషించారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి సీతక్క



తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని మంత్రి సీతక్క దర్శించుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రంగనాయకుల మండపంలో ఆలయ పండితులు మంత్రి సీతక్కు వేదాశీర్వచనం అందించగా, అధికారులు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. శ్రీవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. పని ఒత్తిడి వల్ల మొక్కులు చెల్లించుకోవడం ఆలస్యమైందని చెప్పారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు తెలిపారు.

## ఇప్పట్లో టారిఫ్‌లు పెంచం: బీఎస్ఎన్ఎల్




న్యూఢిల్లీ, అక్టోబర్ 22: ప్రభుత్వరంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్ ఇప్పట్లో టారిఫ్ చార్జీలు పెంచేది లేదని స్పష్టంచేసింది. ఇప్పటికే టెలికం దిగ్గజాలు జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు టారిఫ్ చార్జీలను 30 శాతం వరకు పెంచిన విషయం తెలిసిందే. దీనిపై బీఎస్ఎన్ఎల్ సీఎండీ రాబర్ట్ రవి మాట్లాడుతూ..సమీప భవిష్యత్తులో టారిఫ్ చార్జీలను పెంచాలనుకోవడం లేదని, ప్రస్తుతం కస్టమర్ల సంతోషాన్ని, వారి విశ్వాసాన్ని గెలుచుకోవడానికి ప్రయత్నాలను వేగవంతం చేసినట్లు చెప్పారు. కంపెనీకి చెందిన నూతన లోగోను టెలికం మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..వచ్చే ఏడాది లక్ష 4జీ సైట్లను నెలకొల్పాలనుకుంటున్నట్లు, భవిష్యత్తులో 5జీగా మారనున్నాయన్నారు. నూతన సేవల వివరాలు..

## విమానయానం ఆగమాగం..

**9 రోజుల్లో 170 విమానాలకు బాంబు బెదిరింపులు**
**24 గంటల్లోనే 80 విమానాలకు బెదిరింపులు**
**మూడు అంతర్జాతీయ సర్వీసుల దారి మళ్లింపు**
**కేంద్రమంత్రి హెచ్చరించినా ఆగని బెదిరింపులు**



న్యూఢిల్లీ, అక్టోబర్ 22: దేశంలో విమానాలకు బాంబు బెదిరింపులు పెద్ద సమస్యగా మారిపోయింది. ఫోన్‌లు, ఈమెయిళ్లు, సోషల్ మీడియా ద్వారా గుర్తు తెలియని వ్యక్తులు చేస్తున్న బెదిరింపులతో విమాన ప్రయాణాలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నది. ఫలితంగా విమానయాన సంస్థలు నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తున్నది. బాంబు బెదిరింపులను అడ్డుకునేందుకు భద్రతా సంస్థలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. బెదిరింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్ర విమానయాన శాఖ మంత్రి హెచ్చరించినప్పటికీ దుశ్చర్యలు ఆగడం లేదు. గత తొమ్మిది రోజుల్లోనే 170 విమానాలకు బాంబు బెదిరింపులు వచ్చాయంటే పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకోవచ్చు.

బెదిరింపులతో ఆగమాగం

'విమానంలో బాంబు పెట్టాం' అని దుండగులు, ఆకతాయిలు పంపిస్తున్న హెచ్చరికలతో విమానాశ్రయాల్లో హైరానా నెలకొంటున్నది. ఏ విమానానికి బాంబు బెదిరింపు వచ్చినా కచ్చితంగా బాంబు థ్రెట్ అసెస్‌మెంట్ కమిటీ(బీటీఏసీ) ప్రొటోకాల్, అంతర్జాతీయ మార్గదర్శకాల ప్రకారం తనిఖీల ప్రక్రియను చేపట్టాల్సిందే. దీంతో అనేక విమానాలు ఆలస్యమవుతున్నాయి. అప్పటికే ప్రయాణంలో ఉన్న విమానాలను ఉన్నపళంగా వేర్వేరు విమానాశ్రయాలకు దారి మళ్లించాల్సి వస్తున్నది. ఫలితంగా విమానయాన సంస్థలు నష్టపోతున్నాయి. గత తొమ్మిది రోజుల్లో వచ్చిన బాంబు బెదిరింపులకు విమానయాన సంస్థలు దాదాపుగా 600 కోట్లు నష్టపోయి ఉంటాయని గతంలో ఓ విమానయాన సంస్థలో పని చేసిన ఓ అధికారి తెలిపారు. సాధారణంగా ఒక డొమెస్టిక్ విమాన సర్వీసుకు అంతరాయం కలిగితే సగటున రూ. 1.5 కోట్లు నష్టం వస్తుందని, అంతర్జాతీయ విమానానికి ఇది దాదాపు రూ. 3.5 కోట్ల వరకు ఉండొచ్చనే అంచనాలు ఉన్నాయి.

## ఫిరాయింపులపై సీఎంను సూటిగా ప్రశ్నించిన కేటీఆర్



హైదరాబాద్ : పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ పోరాడుతున్న సంగతి తెలిసిందే. ఇదే అంశంపై కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కూడా తీవ్రంగా స్పందించారు. పార్టీ ఫిరాయింపులు అప్రజాస్వామికమని, కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. జీవన్ రెడ్డి వ్యాఖ్యలపై స్పందిస్తూ కేటీఆర్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.


మీ సొంత పార్టీ నేతనే.. మీరు చేసిన ఎమ్మెల్యేల ఫిరాయింపులు అప్రజాస్వామికమని, దుర్మార్గమైన చర్య అని సూటిగా వేలెత్తి చూపుతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఇప్పటికైనా మీరు లెంపలేసుకుంటారా..? జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నాయకుడే.. ఇది కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకం అని.. మీ దిగజారుడు రాజకీయాలపై దుమ్మెత్తి పోశారని కేటీఆర్ తెలిపారు. ఇప్పటికైనా మీరు చేసిన తప్పును ఒప్పుకుంటారా..? క్షమాపణ చెబుతారా..? మీరు గడప గడపకు వెళ్లి చేర్చుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై చట్టప్రకారం వేటు వేయాల్సిందేనని పట్టుబడుతున్నారు. ఇప్పటికైనా ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు ఉంటాయా..? ఇప్పుడు రాయితో కొట్టాల్సింది ఎవరిని..? ఫిరాయించిన ఎమ్మెల్యేలనా..? ప్రోత్సహించిన మిమ్ములనా..? అని కేటీఆర్ ప్రశ్నించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కంటికి కునుకు లేకుండా చేస్తున్నది : ఎంపీ ఈటల



రామంతాపూర్,అక్టోబర్ 23 : కాంగ్రెస్‌ను గెలిపించిన ఖర్మానికి పేద ప్రజల కంటికి కునుకు లేకుండా చేస్తుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. బుధవారం రామంతాపూర్ బాలకృష్ణానగర్ మూసీ పరివాహక ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూసీ నది పక్కన 30 ఏండ్లుగా నివాసముంటున్న పేద ప్రజల ఇండ్లు కూల గొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూసీ సంబంధించి కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు డీపీఆర్ సిద్ధం చేయలేదన్నారు. శనివారం, ఆదివారం వస్తే పేద ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. నోరు విప్పితే చాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అబద్ధాలు తప్పా ఒక్కటి కూడా నిజం మాట్లాడం లేదన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్ర పరిపాలన మీద దృష్టి సారించాలన్నారు. కూల గొట్టుడు, డబ్బులు వసూల్ చేసుడు బంద్ చేయాలని పేర్కొన్నారు. పేద ప్రజలు ఉసురు మంచిది కాదన్నారు. పేదలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు కొనసాగించాలన్నారు. పేద ప్రజల జీవితాలతో ఆడుకునే ప్రయత్నం చేయొద్దని హితవు పలికారు.

## తుఫాన్ దాన.. ఒడిశా, బెంగాల్‌లో రెడ్ అలర్ట్




భువనేశ్వర్: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర తుఫాన్‌గా మారింది. ఒడిశా, బెంగాల్ తీరాన్ని దాన తుఫాన్(.. ఇవాళ కానీ రేపు కానీ తీరం దాటే అవకాశం ఉన్నది. ఆ సమయంలో తీరం వెంట గంటకు 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీయనున్నాయి. ఒడిశాలోని బాలాసోర్, భద్రక్, కేంద్రపాద, బయూర్‌బంజ్, జగత్‌సింగ్‌పూర్, పూరి జిల్లాలపై తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉండనున్నది. తుఫాన్ నేపథ్యంలో భారతీయ వైమానిక దళానికి చెందిన రెండు విమానాలు ఎన్డీఆర్ఎఫ్ దళాలతో సిద్ధంగా ఉన్నాయి. బటిండా నుంచి ఐఎల్ 76, ఏఎన్ 32 విమానాలు రిలీఫ్ మెటీరియల్‌తో భువనేశ్వర్ చేరుకున్నాయి.%బెంగాల్‌లోని పలు జిల్లాల్లో 23వ తేదీ నుంచి 26వ తేదీ వరకు స్కూళ్లను మూసివేశారు. పలు జిల్లాలో సుమారు 500 రిలీఫ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు ఒడిశా మంత్రి సురేశ్ పూజారి తెలిపారు. లక్షలాది మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించనున్నట్లు వెల్లడించారు.

## కమలా హ్యారిస్‌కు మద్దతు ఇచ్చే ఎన్జీవోకు బిల్ గేట్స్ విరాళం



న్యూయార్క్: మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, బిలియనీర్ బిల్ గేట్స్.. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో కమలా హ్యారిస్‌కు సపోర్టు ఇస్తున్నట్లు స్పష్టమవుతోంది. హ్యారిస్‌కు మద్దతు ఇస్తున్న ఓ ఎన్జీవో సంస్థకు బిల్ గేట్స్ 50 మిలియన్ల డాలర్లు విరాళం ఇచ్చినట్లు తెలిసింది. ఫ్యూచర్ ఫార్వర్డ్ అనే సంస్థకు ఆయన డోనేట్ చేశారు. అయితే దేశాధ్యక్ష పోటీలో ఉన్న రిపబ్లికన్ నేత డోనాల్డ్ ట్రంప్‌పై బిల్ గేట్స్ ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. మిత్రులకు,ఇతరులకు ఆయన చేసిన ఫోన్ కాల్స్ ఆధారంగా ఈ విషయాన్ని అంచనా వేశారు. ఒకవేళ ట్రంప్ ఎన్నికైతే, ఫ్యామిలీ ప్లానింగ్, గ్లోబల్ హెల్త్ ప్రోగ్రామ్స్‌కు నిధులు తగ్గే అవకాశాలు ఉన్నట్లు గేట్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఎవరితోనైనా కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు గేట్స్ వెల్లడించారు. నవంబర్ 5వ తేదీన జరగబోయే ఎన్నికలు చాలా భిన్నమైనవని బిల్ గేట్స్ చెప్పారు. హెల్త్‌కేర్ వృద్ధి, పేదరిక నిర్మూలన, వాతావరణ మార్పులపై స్పష్టమైన పోరాటం చేసే అభ్యర్థులకు తన మద్దతు ఉంటుందని బిల్ గేట్స్ తెలిపారు.

## ఆ వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పే ప్రసక్తే లేదంటున్న డిప్యూటీ సీఎం

## 'సనాతన' వ్యాఖ్యలపై ఉదయనిధి స్టాలిన్



చెన్నై, అక్టోబర్ : సనాతన ధర్మాన్ని నిర్మూలించాలన్న తన వ్యాఖ్యలపై తమిళనాడు డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ వెనక్కి తగ్గటం లేదు. తాను చేసిన వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పే ప్రసక్తే లేదని తాజాగా స్పష్టం చేశారు. సోమవారం ఓ ఆదర్శ వివాహ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, 'తమిళనాడులోనే గాక భారతదేశంలో అనేక చోట్ల నాపై కోర్టుల్లో కేసులు ఉన్నాయి. ఈ కేసులన్నీ వక్రీకరణల ఆధారంగా పెట్టారు. నేను కలైంజ్ఞర్ దివంగత సీఎం కరుణానిధి మనవడ్ని. ఈ అంశంలో క్షమాపణలు చెప్పే ప్రసక్తే లేదు' అని అన్నారు. తమిళనాడుపై బలవంతంగా హిందీ భాషను రుద్దాలని చూస్తున్నారని, నవ వధూవరులు తమకు పుట్టబోయే పిల్లలకు అందమైన తమిళ పేర్లే ఎంచుకోవాలని కోరారు.

## పెరుగుతున్న ఉష్ణోగ్రతలు.. భూమికి రక్షణగా డైమండ్ డస్ట్!



న్యూయార్క్, : పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి భూమికి రక్షణ కల్పించేందుకు డైమండ్ డస్ట్‌ను ఉపయోగించవచ్చని శాస్త్రవేత్తలు కొత్త ప్రతిపాదన చేశారు. ఈ అధ్యయనానికి సంబంధించిన వివరాలు 'జియోఫిజికల్ రిసెర్చ్ లెటర్స్'లో ప్రచురితమయ్యాయి. ప్రతియేటా 50 లక్షల టన్నుల డైమండ్ డస్ట్‌ను భూమి ఎగువ వాతావరణంలో వెదజల్లాలని శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. తద్వారా భూమిపై 1.6 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతను తగ్గించవచ్చని తెలిపారు. డైమండ్ డస్ట్‌ను భూమి ఎగువ వాతావరణంలో వెదజల్లితే అది అద్దంలా పని చేస్తుందని, భూమిపై పడాల్సిన సూర్యకిరణాలను అడ్డుకొని, తిరిగి అంతరిక్షంలోకే ప్రతిబింబించేలా చేస్తుందని చెప్పారు.

## సంపాదకీయం

**గురువారం 24-10-2024**

# పేదరికాన్ని గణించడం ఇలానా

'పేదరికం' అని వాళ్ళు పరిగణించేదానిని అంచనా కట్టే పనిలో అనేక అంతర్జాతీయ సంస్థలు ఇప్పుడు మునిగివున్నాయి. కొంత కాలం వరకూ ఈ పని ప్రపంచ బ్యాంక్ చూసేది. ఇప్పుడు ఐరాస అభివృద్ధి ప్రాజెక్టు, హ్యూమన్ డెవలప్‌మెంట్ ఇనీషియేటివ్ అనే ఆక్స్‌ఫర్డ్ సంస్థ ఆ పనిలో ఉన్నాయి. ఇవేవీ వాస్తవంగా పేదరికాన్ని అంచనా కట్టే లక్ష్యంతో లేవు. నయా ఉదారవాదాన్ని అందంగా చిత్రించే పనిలో ఉన్నాయి. "కడు పేదరికం" అంటే 2011 నాటి డాలర్ కొనుగోలుశక్తి ప్రాతిపదికన రోజుకు 1.90 డాలర్లు తలసరి వినియోగం కన్నా హీన స్థాయిలో ఉండడం. అంటే తలసరి రోజుకు దాదాపు రూ.53 ఖర్చు చేయగలిగే పరిస్థితి ఉంటే అది 'కడు పేదరికం' స్థాయికి ఎగువన ఉన్నట్టే. ప్రపంచబ్యాంక్ అంచనా ప్రకారం 1990 దశాబ్దం చివరి భాగంలో ఈ స్థాయి కన్నా దిగువన సుమారు 30 శాతం ప్రపంచ జనాభా ఉండేవారు. 2022 నాటికి ఆ స్థాయికి దిగువన కేవలం 10 శాతం కన్నా కూడా తక్కువే ఉన్నారని ప్రపంచబ్యాంక్ తెలిపింది. అంటే నయా ఉదారవాద విధానాల అమలు తర్వాత కోట్లాదిమంది ప్రపంచ జనాభా కడు పేదరిక స్థాయి నుండి బైట పడ్డారు అన్నది ప్రపంచబ్యాంక్ చెప్పదలచుకుంది. ఇది పూర్తిగా లోపభూయిష్టమైన అంచనా. ఎలాగో ఇప్పుడు చూద్దాం.ప్రపంచబ్యాంక్ అంచనా కట్టే పద్ధతిలో మూడు పొరపాట్లు ఉన్నాయి. మొదటిది: ఒక వ్యక్తి దగ్గర ఉన్న సంపద పెరిగిందా, తరిగిందా అన్నది ప్రపంచబ్యాంక్ లెక్కలోకి తీసుకోకుండా కేవలం ఆ వ్యక్తి ఆదాయం పరిస్థితిని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటుంది. రెండవది: ఒక వ్యక్తి ఆదాయాన్ని అంచనా కట్టడానికి ఆ వ్యక్తి చేసే వ్యయాన్ని ప్రాతిపదికగా తీసుకుంటుంది. మూడవది: వాస్తవ వ్యయాన్ని అంచనా కట్టడానికి అది ధరల సూచికను ప్రాతిపదికగా తీసుకుంటుంది. ఈ ధరల సూచిక వాస్తవ జీవన వ్యయాన్ని సక్రమంగా ప్రతిబింబించడం లేదని అందరికీ తెలుసు. ఈ మూడు పొరపాట్ల ఫలితంగా వచ్చే నిర్ధారణలు చాలా పెద్ద పొరపాటు అంచనాలకు దారి తీస్తాయి. ఇప్పుడు ఒక్కొక్క అంశాన్నీ చూద్దాం.ఒక వ్యక్తి ఆర్థిక స్థాయిలో వచ్చిన మార్పులను పరిశీలించడానికి ఆ వ్యక్తికి వస్తున్న ఆదాయాన్ని, ఆ వ్యక్తి వద్దనున్న సంపదలో పెరుగుదల లేదా తరుగుదలను– ఈ రెండింటినీ లెక్కలోకి తీసుకోవాలి.ఉదాహరణకు: ఒక వ్యక్తికి ఏడాది క్రితం ఎంత ఆదాయం వస్తోందో. ఇప్పుడూ అంతే ఆదాయం వస్తోందనుకోండి. కాని ఇదే ఏడాది కాలంలో ఆవ్యక్తి దగ్గరున్న సంపద కాస్తా హరించుకు పోయిందనుకోండి. అటువంటి వ్యక్తి ఆదాయంలో ఏ మార్పూ లేదు కనుక ఆర్థిక స్థాయిలోనూ ఏ మార్పూ లేదని మనం చెప్పగలమా? ఉన్న సంపద కాస్తా హరించుకుపోయినప్పుడు ఆ వ్యక్తి మరింత పేదరికంలోకి జారిపోయినట్టు కాదా? కాని ప్రపంచబ్యాంక్ పద్ధతిలో ఆ వ్యక్తి సంపద పరిస్థితి ఏమార్పులకు లోనైంది అన్న అంశం పరిశీలనలోనే ఉండదు. నయా ఉదారవాద విధానాలు అంటేనే సంపదను కొల్లగొట్టి పోగేసుకోవడం. అంటే చాలామంది వ్యక్తులను వారి వారి సంపదకు దూరం చేసి దానిని స్వాహా చేయడం. ఇటువంటి విధానాలను ఒకపక్క అమలు చేస్తూ మరొకపక్క కోట్లాది మంది పేదరికం లోంచి బైట పడ్డారని చెప్పుకోవడం అవహేళన చేయడమే.రెండవది: ఆదాయాన్ని లెక్కించడంలో కూడా వాస్తవ ఆదాయాన్ని లెక్కించకపోవడం. భారతదేశంతో సహా చాలా దేశాల్లో వ్యక్తుల వాస్తవ ఆదాయాలకు సంబంధించిన వివరాలు లేవు. ఆదాయం అంటే ఏయే అంశాలను పరిశీలించాలి అన్నదే ఒక సంక్లిష్టమైన విషయం. అందుచేత వ్యయాన్ని పరిగణనలోకి తీసుకోవడం పరిపాటి అయింది. వ్యయానికి సంబంధించి లెక్కలు లభిస్తున్నాయి గనుక దానినే ప్రాతిపదికగా తీసుకుని వ్యక్తుల ఆదాయాలను లెక్కించడం జరుగుతోంది.వ్యయాన్ని బట్టి ఆదాయం లెక్కించాలనుకున్నప్పుడు ఆ వ్యక్తి సంపద లో వచ్చిన మార్పులను పరిశీలించకపోవడం ఏమాత్రమూ క్షంతవ్యం కాదు. ఎందుకంటే ఒక వ్యక్తి ఆదాయం పడిపోయినా, ఆ వ్యక్తి తన వద్దనున్న ఇతర సంపదను అమ్ముకుని ఆ సొమ్ముతో గతంలో మాదిరిగానే తన వ్యయాన్ని కొనసాగించవచ్చు. వాస్తవానికి ఆ వ్యక్తి పేదరికం పెరిగింది అని నిర్ధారించాలి. కాని వ్యయం స్థాయి యథాతథంగా నిలబడింది గనుక ఆ వ్యక్తి పేదరికం పెరగలేదు అని నిర్ధారించడం అర్థరహితం కాదా ?మూడవది: వ్యయాన్ని లెక్కించినప్పుడు కూడా వాస్తవ వ్యయం ఎంతో నిర్ధారించడానికి ఆ వ్యయాన్ని ధరల సూచీతో పోల్చి సరి చేస్తారు. ఈ ధరల సూచీ వాస్తవ ధరల పెరుగుదలను ప్రతిబింబించదు. ప్రజలకు గల సాధారణ అవసరాలను బట్టి కొన్ని వస్తువులను మాత్రం లెక్కలోకి తీసుకుని వాటి ధరల్లో వచ్చే మార్పులను మార్కెట్ సర్వే ద్వారా నిర్ధారిస్తారు. దానిని బట్టి ధరల సూచీ లో మార్పులను నిర్ధారిస్తారు. ఐతే, ఎప్పటినుంచి పెరుగుదలను పరిశీలించాలి అన్నదానికి ఒక సంవత్సరాన్ని ప్రాతిపదికగా తీసుకుంటారు (ఉదా: 1960, 1982, 2011– ఈ సంవత్సరాలను బేస్ సంవత్సరాలుగా తీసుకుని వివిధ ధరల సూచికలు రూపొందుతాయి). అయితే, అప్పటికీ, ఇప్పటికీ అవే సరుకులను అదే ప్రాధాన్యతతో ప్రజలు ఉపయోగించరు. వినియోగంలో వచ్చే మార్పులను ఈ ధరల సూచీ పరిగణనలోకి తీసుకోదు. అదే మాదిరిగా బేస్ సంవత్సరం నాడు లభించిన సరుకులు ఇప్పుడు లభించవు కూడా. ఈ మార్పులను ధరల సూచీ లెక్కలోకి తీసుకోదు.ఉదాహరణకి: నయా ఉదారవాద విధానాలు వచ్చాక చాలా సేవలు ప్రైవేటుపరం అయ్యాయి. ముఖ్యంగా విద్య, వైద్యం. ఇవి అంతకు మునుపు ప్రభుత్వ వ్యవస్థ ద్వారా అందేవి. ఇప్పుడు వాటి ఖరీదు విపరీతంగా పెరిగిపోయింది. వాటిని వినియోగించడం ప్రజలకు అనివార్యం. కాని ధరల సూచీ ఈ రెండింటినీ ఇప్పటికీ ఉచితంగానే లభిస్తున్నవిగా పరిగణిస్తుంది. ఉదాహరణకు ఒక ప్రభుత్వ ఆస్పత్రిలో ఒక ఆపరేషన్‌కు బేస్ సంవత్సరంలో రూ.1000 వసూలు చేసినది ఇప్పుడు రూ.2000 వసూలు చేస్తే, ఈ తేడాను మాత్రమే ధరల సూచీ లెక్కలోకి తీసుకుంటుంది. ప్రభుత్వ వైద్య వ్యవస్థ విస్తరించనందు వలన ప్రైవేటు వైద్యానికి అనివార్యంగా ప్రజలు పోవలసివస్తోంది. అక్కడ ఇదే ఆపరేషన్‌కు రూ.10,000 వసూలు చేస్తారు. కాని ధరల సూచీలో ప్రభుత్వ ఆస్పత్రులలో పెరిగిన ఫీజులను మాత్రమే లెక్కలోకి తీసుకుంటారు. వాస్తవ జీవన వ్యయం ధరల సూచీలో చూపుతున్న దానికన్నా ఎన్నో ఎక్కువ రెట్లు పెరిగింది. కాని దానిని లెక్కించనందు వలన అధికారిక ధరల సూచీని మాత్రమే పరిగణనలోకి తీసుకుని ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డట్టు చిత్రిస్తారు.నిజానికి జీవన వ్యయం పెరిగిన ప్రతీ సందర్భంలోనూ ప్రజలు సర్దుబాటుకు రెండు విధాలుగా ప్రయత్నిస్తారు. మొదటిది: ఉన్న ఆస్తులను, సంపదను అమ్ముకోవడం. లేదా అప్పులు చేయడం. రెండవది: వినిమయాన్ని తగ్గించుకోవడం. అలా వినిమయాన్ని తగ్గించుకోవలసి వచ్చినప్పుడు అత్యంత అవసరమైన వాటికి మాత్రమే ఖర్చు చేస్తారు. వైద్యం అటువంటి అత్యవసరమైన ఖర్చు. ప్రైవేటీకరణ కారణంగా దాని ఖర్చు బాగా పెరిగింది. ఐనా ఖర్చు చేయక తప్పదు. అందుకోసం ప్రజలు తమ తిండి ఖర్చులను సైతం తగ్గించుకోవలసి వస్తోంది. పిల్లల చదువు నిమిత్తం చేసే ఖర్చుకు కూడా అటువంటి ప్రాధాన్యతే ఉంటుంది. ఈ రెండు సేవలనూ ప్రైవేటు రంగం నుండి పొందవలసి వస్తున్నందున

# ఖాకీ డ్రెస్సుకు జీవో కష్టాలు ఎస్సైలకు పన్నెండు ఏండ్లైనా పదోన్నతుల్లేవ్!



పెద్దపల్లి: వారు పోలీసు ఆఫీసర్లు.. అన్యాయం జరిగిందని ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఎంక్వైరీ చేసి న్యాయం చేయాల్సిన బాధ్యత వారిదే.. కానీ, వారికే అన్యాయం జరిగితే ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆవేదన చెందుతున్నారు. తమ తోటి వారితో పాటు జూనియర్ల కింద పని చేయాల్సిన పరిస్థితికి కుమిలిపోతున్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన 317జీవో కొంతమంది పోలీసు ఆఫీసర్ల పాలిట శాపంగా మారింది. జీవోతోపాటు జోన్ల మార్పు కూడా దీనికి మరో కారణంగా మారింది. ఫలితంగా 2012లో సెలెక్ట్ అయిన ఎస్ఐల బ్యాచ్‌లో కొందరికి ప్రమోషన్లు రాగా.. మరికొందరికి రాకుండా పోయాయి. నిబంధనల ప్రకారం పోలీస్ శాఖలో ఆరేళ్లకే పదోన్నతి రావాల్సి ఉన్నప్పటికీ.. పుష్కరకాలం గడిచినా కొంతమందికి ఇప్పటికి ప్రమోషన్ రాలేదు. అధికారులకు, మంత్రులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా ప్రయోజనం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీ చైర్మన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి 2012 బ్యాచ్ ఎస్సైలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు న్యాయం చేయాలని విన్నవించారు..

కొందరికే అన్యాయం..

2012 బ్యాచ్‌కు చెందిన కొందరు అధికారులతో పాటు 2014 బ్యాచ్‌కు చెందిన జూనియర్లు ప్రమోషన్లు పొంది వీరిపై అధికారిగా వారి వద్దకే వస్తుండటంతో గతంలో ఆలయ్ బలయ్ చేసుకునే స్నేహితులకే ఇప్పుడు సెల్యూట్ చేయాల్సి వస్తోందని మనస్తాపం చెందుతున్నారు. 2012లో ఫిఫ్త్ జోన్ నుంచి 146మంది ఎస్ఐలుగా పోలీస్ శాఖలో చేరారు. ఇందులో 2021లో 46 మంది ఎస్ఐలకు ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి కల్పించారు. గతంలో ఫిఫ్త్ జోన్‌లో కరీంనగర్, ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాలు ఉండేవి. గత ప్రభుత్వం తెచ్చిన 317జీవోతో మల్టీజోన్ 1, మల్టీజోన్ 2 గా ఏర్పడ్డాయి. గతంలో ఫిఫ్త్ జోన్ లో ఉన్న ఉమ్మడి జిల్లాలతో పాటు కామారెడ్డి, నిజామాబాద్, సిద్దిపేట్, మెదక్ జిల్లాలు మల్టీ జోన్ 1 పరిధిలోకి వచ్చాయి. దీనివల్ల కామారెడ్డి, నిజాంబాద్, సిద్దిపేట, మెదక్ జిల్లాల నుండి 66 మంది ఎస్ఐలు ఫిఫ్త్ జోన్ ఎస్ఐల పైన సీనియార్టీలో చేరడంతో పదోన్నతిలో తీవ్ర అన్యాయం జరిగింది.

జోన్‌ల ఏర్పాటుతో గందరగోళం..

జోన్‌ల ఏర్పాటు అనంతరం 2012 బ్యాచ్ ఎస్ఐలకు 35 మందికి పదోన్నతి కల్పించారు. వీరితోపాటు 2014బ్యాచ్ కు చెందిన ఇద్దరికి ఇన్స్పెక్టర్లుగా పదోన్నతి కల్పించారు. 317 జీవో వల్ల ఆరేళ్లకే దక్కాల్సిన పదోన్నతి 12 ఏళ్లు గడిచిన దక్కకపోవడంతో 65 ఎస్సై లుగానే మిగిలిపోయారు. ఒకే బ్యాచ్ లో ఎంపికైన కొందరికి పదోన్నతి రావడంతో పాటు జూనియర్లకు పదోన్నతి వచ్చి వారిపైనే అధికారిగా రావడంతో సెల్యూట్ కొట్టాల్సిన దుస్థితి ఎదుర్కొంటున్నారు. పాత సీనియార్టీ ప్రకారమే పదోన్నతి కల్పించాలని, 317జీవో వల్ల నష్టపోయామని 65 మంది ఎస్ఐలు పది నెలలుగా పాలకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సబ్ కమిటీ చైర్మన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డికి వినతి చేశారు. ఉన్నతాధికారులను కూడా పలుమార్లు కలిసి తమ బ్యాచ్ కు చెందిన ఎస్ఐలకు పదోన్నతి వచ్చి మూడేళ్లు గడిచిందని, న్యాయం చేసి పదోన్నతి కల్పించాలని వేడుకున్నారు.

సీఎం రేవంత్ దృష్టికి సమస్య..

తమ సమస్యను ముఖ్యమంత్రి దగ్గరికి తీసుకువెళ్లాలని, లేదా ముఖ్యమంత్రితో తమకు అపాయింట్మెంట్ ఇప్పించాలని వేడుకున్న లాభం లేకుండా పోయింది. రెండు రోజుల క్రితం సబ్ కమిటీ రిపోర్టును ఇవ్వడంతో 317 జీవో వల్ల జరిగిన నష్టం సీఎం రేవంత్ దృష్టికి వెళ్ళింది. ఈనెల 26న జరిగే మంత్రివర్గ సమావేశంలో దీనిపై ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం.

# సంజయ్‌కు మరోసారి పగ్గాలివ్వాలి..బీజేపీ శ్రేణుల డిమాండ్



హైదరాబాద్,రాష్ట్ర బీజేపీలో కొత్త నినాదం ఊపందుకుంటోంది. గతంలో దాదాపు మూడేళ్లపాటు పార్టీ పగ్గాలు పట్టి రాష్ట్రంలో పార్టీని విస్తృతం చేసిన బండి సంజయ్‌కు మరోసారి రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించాలన్న డిమాండ్ పెరుగుతోంది. పార్టీ శ్రేణులు బహిరంగంగానే తమ ఆలోచనలను, ఆకాంక్షలను అధిష్ఠానానికి వివరిస్తున్నాయి. సంతకాల సేకరణ, లేఖలతో తమ అభిప్రాయాలను చెబుతున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోంమంత్రి అమిత్ షా, పార్టీలో కీలక వ్యక్తులు సంతోష్.. బన్సల్ వంటివారికి వినతుల ద్వారా స్పష్టం చేస్తున్నారు. ఒకప్పుడు జంటనగరాలకే పరిమితమన్న ముద్ర పడిన పార్టీని గ్రామీణ ప్రాంతాల్లో వికసించేలా చేయడంలో సంజయ్ విజయం సాధించిన విషయాన్ని వారు ప్రస్తావిస్తున్నారు.ప్రత్యర్థులపై ధాటీగా విమర్శలు చేయడం, కార్యకర్తల కోసం, ప్రజాసమస్యలపైన క్షేత్రస్థాయిలో బలంగా పోరాడటంలో బండి దూకుడుగా వ్యవహరిస్తారు. అదే కార్యకర్తల్లో జోష్‌ను పెంచుతోంది. బండి వస్తే కమలం కదంతొక్కడం.. దూసుకుపోవడం ఖాయమన్నది వారి విశ్వాసం. అందుకు తగిన కారణాలను వారు వివరిస్తున్నారు.రాష్ట్ర బీజేపీలో బండి సంజయ్ ఓ ఫైర్‌బ్రాండ్. అచ్చమైన తెలంగాణ మాండలికంలో, ద్వితీయ శ్రేణి నేతలు, కార్యకర్తల్లో ఉత్సాహం ఉరకలెత్తేలా మాట్లాడటంలో ఆయనది ప్రత్యేక శైలి. అతి చిన్నవయస్సులోనే ఆర్ఎస్ఎస్‌తో అడుగులు వేసి, ఏబీవీపీలో పనిచేసి రాటుదేలి.. పరివార్ ఆలోచనలతో ఎదిగిన బండి సంజయ్ కరీంనగర్‌లో రాజకీయాలు ప్రారంభించారు. కార్యకర్తలతో కలసిపోవడం.. భేషజాలు లేకుండా పనిచేయడం, పోరాడటం, అరెస్టులకు, కేసులకు భయపడకపోవడం వంటి లక్షణాలతో ఆయన మాస్ లీడర్‌గా పేరు తెచ్చుకున్నారు.కార్పొరేటర్ స్థాయి నుంచి ఒక్కో మెట్టూ ఎక్కి ప్రస్తుతం కేంద్రమంత్రి స్థాయికి చేరుకున్నారు. ఓబీసీ వర్గానికి చెందిన బండి సంజయ్‌కు అనూహ్యంగా 2020లో బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా పనిచేసే అవకాశం వచ్చింది. బీజేపీ తీసుకున్న సంచలన నిర్ణయాల్లో ఇది ఒకటి. తెలంగాణలో ఎలాగైనా అధికారం చేపట్టాలన్న లక్ష్యంతో గడచిన దశాబ్దంగా వ్యూహాలు అమలు చేస్తున్న జాతీయ నాయకత్వం తీసుకున్న నిర్ణయం వెనుక కీలక అంశం ఉంది. అంతవరకు హైదరాబాద్–సికింద్రాబాద్‌కే బీజేపీ పరిమితమై ఉండేది. ప్రత్యేకించి ఒక సామాజిక వర్గానికి చెందినవారికే రాష్ట్ర పార్టీ పగ్గాలు అందేవి. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఆ పార్టీ మచ్చుకైనా కన్పించేది కాదు. ఒకటీ అరా ప్రాంతాల్లో అప్పుడప్పుడు చిన్నాచితకా కార్యక్రమాలు మాత్రమే జరిగేవి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్‌నుంచి బండి సంజయ్ ఎన్నికైన తరువాత జాతీయ నాయకత్వం ఆలోచనల్లో స్పష్టమైన మార్పు వచ్చింది.సరైన వ్యూహం అమలు చేస్తే తెలంగాణలో పార్టీ విస్తరించవచ్చున్న విషయాన్ని మోడీ–షా జోడీ గుర్తించింది. అక్కడికి కొద్దిరోజుల తర్వాత మున్నూరు కాపు సామాజికవర్గానికి చెందిన బండి సంజయ్‌కు బీజేపీ రాష్ట్ర శాఖ పగ్గాలు అప్పగించింది. 2020 మార్చిలో ఆయన బాధ్యతలు చేపట్టారు. వెంటనే పోరాటపంథాను అనుసరించారు. అప్పుడు అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌పై నిత్యం ఆరోపణలు, విమర్శలు గుప్పించారు. రోడ్డెక్కారు. కార్యకర్తలను కదం తొక్కించారు. అందుకోసం క్షేత్రస్థాయికి చొచ్చుకుపోయారు. పార్టీని రాష్ట్రం నలుమూలలా విస్తరించే లక్ష్యంతో 'ప్రజా సంగ్రామ యాత్ర' పేరుతో ఐదు దశల్లో పాదయాత్ర చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఆంక్షలు, అరెస్టులు, వేధింపులు తప్పలేదు. అయినా ఎదుర్కొని మాస్ లీడర్‌గా%8%% క్రౌడ్‌పుల్లర్‌గా ఎదిగారు. శ్రేణుల్లో హీరోగా నిలిచారు.317 జీవోతో ప్రభుత్వ ఉద్యోగులకు నష్టం జరుగుతున్న నేపథ్యంలో వారి తరపున పోరాటం చేశారు. జాగరణ పేరుతో ఉద్యోగులతో కలసి రాత్రిపూట నిరసనల కార్యక్రమం చేపట్టారు. ఇలా ఒక్కో అంశంపై తనదైన పంథాలో దూసుకుపోయారు. ఫలితంగా బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా మారింది. బీఆర్ఎస్‌ను ఢీకొట్టే శక్తిగా ప్రజలు భావించారు. బండి సంజయ్ దాదాపు మూడేళ్లపాటు బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా పనిచేశారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ శక్తిగా బీజేపీని మలిచారు. కొన్నిసార్లు నోరు జారారు.. వివాదాల్లో చిక్కుకున్నారు.. వాటినుంచి పాఠాలు నేర్చారు. బీఆర్ఎస్ కుంచుకోట దుబ్బాకలో బీజేపీ పతాకం ఎగరేసేలా చేయడంలో బండి సంజయ్ పోరాటం శ్రేణులకు స్ఫూర్తిగా నిలిచింది. ఆ తరువాత జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీజేపీకి ఎన్నడూ లేని రీతిలో 48 డివిజన్లలో విజయం సాధించి రెండో అతిపెద్ద పార్టీగా అవతరించింది.ఇవన్నీ సంజయ్ పోరాట ఫలితాలే. ఆ పరిస్థితుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌పై ప్రజల్లో నమ్మకం లేక మూడో స్థానానికే పరిమితమైంది.ఆ పరిస్థితుల్లో, జాతీయ నాయకత్వం వ్యూహంలో అనూహ్యమైన మార్పు రావడం, బండి సంజయ్‌ను మార్చి రాష్ట్ర పార్టీ పగ్గాలు కిషన్‌రెడ్డికి అప్పగించడం వంటి పరిణామాలను శ్రేణులు జీర్ణించుకోవడానికి సమయం పట్టింది. శాసనసభ ఎన్నికలకు కొద్దినెలలముందు జరిగిన ఈ మార్పుతో పార్టీ తీవ్రంగా దెబ్బతింది. దాదాపు అధికారంలోకి వస్తుందనుకున్న స్థితి నుంచి నామమాత్రంగా మిగిలిపోయింది. బండిని మార్చడానికి కొన్ని కారణాలను నాయకత్వం చెప్పినప్పటికీ కార్యకర్తలకు రుచించలేదు. రాష్ట్రంలో అతిపెద్ద, ప్రభావవంతమైన రెడ్డి సామాజికవర్గాన్ని కాదనలేకపోవడం ఒక కారణం.జూనియర్ అయిన బండి నేతృత్వంలో పనిచేయడానికి సీనియర్లు, ఇతర పార్టీలనుంచి రావాలనుకుంటున్న ప్రముఖులు సంశయించడం, పార్టీలో సీనియర్లను కలుపుకుపోకుండా.. ఒంటరిగా సంజయ్ వ్యవహరించడం వంటి మరికొన్ని కారణాలను చెప్పుకొచ్చారు. అయితే, ఈ కారణాల సంగతి ఎలా ఉన్నా.. తాజా శాసనసభ ఎన్నికల్లో ప్రత్యామ్నాయమనుకున్న బీజేపీ.. 8 స్థానాలకు పరిమితం కావాల్సి వచ్చింది. ఈలోగా రాష్ట్రంలో పరిణామాలు వేగంగా మారాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇతర పార్టీలనుంచి ప్రముఖులు బీజేపీలోకి వచ్చారు.తాజా లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అనూహ్యంగా 8 స్థానాల్లో విజ యం సాధించింది. బండి సంజయ్ మరోసారి కరీంనగం నుంచి విజయం సాధించారు.శాసనసభ ఎన్నికల్లో జరిగిన నష్టాన్ని, అందుకు కారణాలను జాతీయ నాయకత్వం గుర్తించింది. హరియాణా వంటి రాష్ట్రాల్లో ప్రభావవంతమైన జాట్ సామాజికవర్గాలను కాదని ఓబీసీ వర్గాలను ప్రోత్సహించి, మంచి ఫలితాలు సాధించిన బీజేపీ తెలంగాణకు సంబంధించిన వ్యూహాల్లోనూ మార్పులపై దృష్టి సారిస్తోంది. కేవలం రెడ్డి సామాజికవర్గానికే పరిమితమైపోకుండా రాష్ట్రంలో బలమైన బీసీ–ఓబీసీ వర్గాలను సమీకరించుకోవడం వారి ఆలోచనల్లో భాగం. అందుకే బండి సంజయ్ (ఓబీసీ), ఈటల రాజేందర్ ( వంటివారికి ప్రాధాన్యత కల్పించింది.మోడీ–షా–నడ్డా వీరిని పలు సందర్భాల్లో మెచ్చుకున్న విషయాన్ని మర్చిపోకూడదు. అందుకే, బండి సంజయ్‌కు కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా అవకాశం ఇచ్చింది. రెడ్డి సామాజికవర్గాన్ని గౌరవిస్తూ చెందిన కిషన్‌రెడ్డికి మరోసారి కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పించింది. అయితే, లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల ఆదరించిన నేపథ్యంలో శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. అయితే దానిని ఒక ఉద్యమంగా.. ఒక వేవ్‌గా మార్చడానికి తగిన మాస్ లీడర్ కావాలి. వివాద రహితుడైన కిషన్‌రెడ్డి సమర్థతపై ఎవరికీ అనుమానం లేదు. కానీ క్షేత్రస్థాయిలో దూకుడుగా.. సై అంటే సై అనే ధోరణితో పనిచేసే నాయకుడిని కార్యకర్తలు కోరుకుంటున్నా రు.హైడ్రా కూల్చివేతల సందర్భంలో ఈటల చొరవగా జనంలోకి వెళ్లారు. గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనల్లో బండి సంజయ్ ప్రత్యక్షంగా పాల్గొన్నారు. నడిరోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. పనిలో పనిగా బీఆర్ఎస్‌పై విమర్శలతో విరుచుకుపడ్డారు. హైదరాబాద్‌లోని అశోక్‌నగర్‌లో అభ్యర్థుల చెంతకు సంజయ్ వెళ్లినప్పుడు వారిలో కన్పించిన జోష్, విశ్వాసాన్ని పసిగట్టిన పార్టీ కార్యకర్తల్లో మళ్లీ బండికి రాష్ట్ర పార్టీ పగ్గాలు అప్పగిస్తే కమలవికాసం ఖాయమన్న నమ్మకం ఏర్పడింది. మిగతా పార్టీలకన్నా కమలంలో భిన్నమైన పరిస్థితులుంటాయి. కార్యకర్తలకు కాస్త చొరవగాను, నిర్భయంగాను వ్యవహరిస్తారు. వారి మనసులోని విషయాలను నేరుగా అధిష్ఠానానికి చేరవేస్తారు. ఇప్పుడు అదే జరుగుతోంది. బండికి పగ్గా లివ్వాలంటూ సంతకాల సేకరణ ప్రారంభించారు. జేపీనడ్డా, అమిత్ షా, పార్టీవ్యూహకర్త బీఎల్ సంతోష్, రామ్‌మాధవ్, సునీల్ బన్సల్ వంటివారికి లేఖలు పంపుతున్నారు. బండి రావాలికమలం కదం తొక్కాలని కోరుతూ పంపిన ఆ లేఖల సంఖ్య ఒకటీ అరా కాదు.. వేలల్లోనే ఉన్నాయి.

# ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పన

న్యూఢిల్లీ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించేందుకు స్కిల్ డెవలప్మెంట్ ప్రణాళికలు, దేశంలోనే మొదటిసారిగా జరుగుతున్న స్కిల్ సెన్సస్‌కి సహకారం అందించాలని కేంద్ర మంత్రి, సెంట్రల్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అధికారులను ఏపీ ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. ఢిల్లీలోని కౌశల్ భవన్‌లో స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ శాఖ కేంద్రమంత్రి జయంత్ చౌధరి, సెక్రటరీ అతుల్ కుమార్ తివారీ, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సీఈవో వేద్ మణి తివారీలతో ఏపీ మంత్రి నారా లోకేష్, ఉన్నతాధికారులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏపీలో చేపట్టనున్న స్కిల్ సెన్సస్‌పై మంత్రి లోకేష్ స్పెషల్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. స్కిల్ సెన్సస్ లక్ష్యం, ఎలా చేపడుతున్నారని కేంద్రమంత్రి ఆరా తీశారు. స్కిల్ సెన్సస్ పైలెట్ ప్రాజెక్టు పూర్తి కాగానే గుర్తించిన లోటుపాట్లు సరిచేసి రాష్ట్ర వ్యాప్తంగా చేపడతామని లోకేష్ వివరించారు. కూటమి ప్రభుత్వం ఐదేళ్లలో లక్షలాది ఉద్యోగాల కల్పనే ప్రధాన లక్ష్యంగా స్కిల్ డెవలప్మెంట్, స్కిల్ సెన్సస్ చేపట్టిందని మంత్రి తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ లక్ష్యం చేరుకునేందుకు కేంద్ర ప్రభుత్వం, నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్, మంత్రిత్వశాఖల నుంచి ఏపీకి ఏమేం కావాలో వివరిస్తూ ఓ లేఖను మంత్రి నారా లోకేష్ అందజేశారు. విజనరీ లీడర్ చంద్రబాబు నాయకత్వంలో నైపుణ్యం గల మానవవనరులను ఏపీ నుంచి అందించే లక్ష్యంగా పనిచేస్తున్నామని, దీని కోసం స్కిల్ డెవలప్మెంట్ కేంద్ర సంస్థలు ఏపీలో ఏర్పాటు చేయాలని కోరారు. పబ్లిక్– ప్రైవేటు పార్టనర్ షిప్ మోడల్‌లో ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కిల్స్ అమరావతిలో నెలకొల్పాలి. వారణాసి, హైదరాబాద్‌లలో విజయవంతంగా నడుస్తున్న మాదిరిగానే స్కిల్ ఇండియా ఇంటర్నేషన్ సెంటర్ ఇన్ అమరావతి కావాలి. గతంలోనే విశాఖపట్నంలో ఏడు ఎకరాలు కేటాయింపు జరిగిన చోట నేషనల్ స్కిల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయాలి. మంగళగిరిలో జెమ్స్ అండ్ జ్యూయలరీ , అమరావతిలో నిర్మాణరంగం, కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, చేనేత–హస్తకళలు, విశాఖలో ఫార్మా లాబ్స్, నెల్లూరు, తిరుపతిలో ఎలక్ట్రానిక్ సిస్టమ్ డిజైన్ మ్యానుఫ్యాక్చరింగ్ సెంటర్స్ ఆఫ్ ఎక్స్ లెన్స్ కేంద్రాలు నెలకొల్పేందుకు స్కిల్ కౌన్సిల్ సహకారం అందించాలన్నారు. నేషనల్ స్కిల్ డెలవప్మెంట్ వెబ్ సైట్లతో ఏపీ స్కిల్ డెవలప్మెంట్ అనుసంధానం చేయాలి. గిరిజనుల నైపుణ్య శిక్షణ కేంద్రాలు నెలకొల్పేందుకు పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని అన్నారు. మంత్రి నారా లోకేష్‌తోపాటు పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, ఏపీ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీ, సీఈవో గణేష్ కుమార్, ఈడీ దినేష్‌కుమార్ పాల్గొన్నారు.మరోవైపు ఢిల్లీ పర్యటనలో ఉన్న మంత్రి నారాయణ కూడా హడ్కో అధికారులతో సమావేశమయ్యారు. ఈ భేటీలో మున్సిపల్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఏకే సింఘాల్, హడ్కో సీఎండీ సంజయ్, హడ్కో విజయవాడ చీఫ్ మూర్తి పాల్గొన్నారు. అమరావతి నిర్మాణం, నెల్లూరులో అభివృద్ధి కార్యక్రమాలకు హడ్కో రుణంపై చర్చించారు. అమరావతి నిర్మాణంలో ప్రభుత్వ విధానాన్ని మంత్రి వివరించారు. అమరావతి నిర్మాణానికి సీఆర్డీఏకు రూ.11 వేల కోట్ల రుణం మంజూరు హడ్కో హామీ ఇచ్చింది. నెల్లూరులో అభివృద్ధి పనులకు రూ.165 కోట్ల రుణం విడుదల చేసేందుకు అంగీకారం తెలిపింది. వారం రోజుల్లో రుణ పక్రియ ప్రారంభిస్తామని వెల్లడించింది. కేంద్ర మంత్రి అమిత్‌షాను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కలిశారు. ఏపీలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. విశాఖ లేదా అమరావతిలో ఎన్ఎఫ్ఎస్‌యూ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బుడగ జంగాలకు సంక్షేమం, విద్య, ఉపాధి, సామాజిక, ఆర్థిక అవసరాలకు సమగ్ర విధానం తయారు చేయాలని కోరారు. ఎంపీ విజ్ఞప్తికి అమిత్‌షా సానుకూలంగా స్పందించారు.

# విమానయాన భద్రతలోప్రభుత్వం రాజీపడదు

న్యూఢిల్లీ,విమానయాన భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు. బెదిరింపులకు పాల్పడేవారిని నో ఫ్లై జాబితాలో చేర్చేలా చట్టాలను సవరిస్తున్నామని పేర్కొన్నారు. ఆయన సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ ఇప్పటి వరకు వచ్చిన బెదిరింపులు మొత్తం బూటకమని తేలిందన్నారు. పౌర విమానయాన శాఖకు కఠినమైన ప్రొటోకాల్ ఉందని.. దానినే తమ శాఖ, విమానయాన సంస్థలు అనుసరిస్తోందని వివరించారు. ఇలాంటి బెదిరింపులు వచ్చిన సమయంలో పరిస్థితి చాలా సున్నితంగా ఉంటుందన్నారు. అంతర్జాతీయ విధివిధానాలను మనం అనుసరించాలని ఆయన వ్యాఖ్యానించారు. బెదిరింపు కాల్స్, సోషల్ మీడియా పోస్టులకు పాల్పడేవారికి జీవిత ఖైదు విధించేలా చట్టపరమైన మార్పులు తెచ్చేందుకు యత్నిస్తున్నామన్నారు. విమానంలో బోర్డింగ్ అయ్యాక బెదిరింపులకు పాల్పడేవారికి ఇటువంటి శిక్ష విధించేలా ఇప్పటికే చట్టంలో సెక్షన్లు ఉన్నాయి. కానీ, ఇతర ప్రాంతాల్లో ఉంటూ బెదిరింపులకు పాల్పడేవారికి కూడా వీటిని వర్తింపజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీనిలో ఉగ్రకోణంపై స్పందించేందుకు కేంద్ర మంత్రి నిరాకరించారు. అక్టోబర్ 14 నుంచి పలు విమానాలకు దాదాపు 100 బెదిరింపులు వచ్చాయి. ఈ అంశంపై పలు వర్గాలతో సమావేశాలు నిర్వహించినట్లు రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానయాన భద్రతా నిబంధనల సవరణ అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని చెప్పారు. 1982 సేఫ్టీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ చట్టాన్ని సవరించే అంశంపై వివిధ శాఖలతో కూడా చర్చిస్తున్నట్లు వివరించారు. 'గత వారం పలు విమానాలకు బెదిరింపులు రావడంతో వేరే మార్గాలకు మళ్లించాము. ప్రతి దానిని ప్రత్యేకంగా విశ్లేషించి వేగంగా, సమర్థవంతంగా చర్యలు తీసుకొన్నాం. అవి తప్పుడు బెదిరింపులైనా.. భద్రత, సురక్షిత విషయంలో రాజీ పడటంలేదు. ప్రయాణికుల ప్రాణాలే మాకు ముఖ్యం. అదే సమయంలో ఒక్క విమానాన్నైనా దారి మళ్లించాలనో, జాప్యం చేయాలనో మేము అనుకోవడం లేదు. హోంశాఖ, ఇతర ఏజెన్సీలతో కలిసి వీటిపై దర్యాప్తును వేగవంతం చేస్తున్నాం. రానున్న రోజుల్లో మెరుగైన పరిస్థితిని చూస్తాం' అని కేంద్ర మంత్రి చెప్పారు. శనివారం ఒక్కరోజే 30కి పైగా విమానాలకు బాంబు బెదిరింపులు రాగా.. ఆదివారం సైతం 24 విమానాలకు వచ్చాయి. ఇండిగో, విస్తారా, ఎయిరిండియా, ఆకాశ ఎయిర్‌తోపాటు పలు అంతర్జాతీయ సర్వీసు విమానాలు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీటిలో ఇండిగో, విస్తారా, ఎయిరిండియాకు చెందిన విమానాలు ఆరు చొప్పున ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ బెదిరింపుల గురించి సంబంధిత అధికారులకు తెలియజేశామని, వారి ఆదేశాల మేరకు భద్రతా విధానాలను పాటిస్తున్నామని విమానయాన సంస్థల ప్రతినిధులు వెల్లడించారు. ఈ వారంలో 90కిపైగా విమానాలకు బాంబు బెదిరింపులు రాగా, అవన్నీ నకిలీవేనని అధికారులు తేల్చారు.

## సవాళ్ల సమయంలోనూ అభివృద్ధి బాట

న్యూఢిల్లీ,ప్రపంచం సవాళ్లను ఎదుర్కొంటున్న వేళ కూడా నూతన వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవడంలో భారత్ మెరుగైన స్థానంలో ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. వస్తు, సేవల విభాగంలో అనేక దేశాలకు భారత్ కీలక భాగస్వామిగా మారాలని భావిస్తోందన్నారు. కొలంబియా యూనివర్సిటీలో నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొన్న మంత్రి ఉపాధి కల్పన, ఆర్థిక వృద్ధి తదితర అంశాలపై మాట్లాడారు. దేశీయంగా సమర్థతను పెంచుకోవడంతో పాటు.. బయటి నుంచి వచ్చే సవాళ్లను తట్టుకొనేలా ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దాలని భావిస్తున్నట్లు సీతా రామన్ చెప్పారు. భారత్‌లోని పెట్టుబడి అవకాశాలను ఆమె ప్రస్తావించారు. ఉపాధి కల్పనే దేశం ముందున్న అతిపెద్ద సవాలన్నారు. 'చాలా మంది యువత డిగ్రీ పట్టాలతో బయటకు వస్తున్నారు. కానీ, తమకున్న అర్హతకు, సాధించిన ఉద్యోగానికి మధ్య వ్యత్యాసం ఉందని వారు భావిస్తున్నారు. ఈ లోటును భర్తీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. కృత్రిమ మేధ వంటి సాంకేతికతల్లో నైపుణ్యాన్ని అందించేందుకు యువతను సన్నద్ధం చేస్తోంది' అని ఆర్థిక మంత్రి అన్నారు. యూన్గి÷డ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ గురించి ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. భారత్ ఎ÷-లాస్టిక్ కార్డుల నుంచి క్యూఆర్ కోడ్‌కు వేగంగా మారినట్లు ఆమె తెలిపారు. చిరు దుకాణాలు, కూరగాయల కోసం కూడా దీనిని వినియోగిస్తున్నామన్నారు. ఫలితంగా చెల్లింపులు మరింత పారదర్శకంగా మారాయని, నగదుపై ఆధారపడటం తగ్గిందన్నారు. థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నుంచి సౌరశక్తి వంటి పునరుత్పాదక ఇంధనం వైపు వేగంగా మారుతోందన్నారు.

## మీ అజెండానా?

అమరావతి,ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి మండిపడ్డారు. ఏపీ సీఎం చంద్రబాబును కాపాడటానికి, డైవర్షన్ పాలిటిక్స్ కోసం ఇంత ఆరోపణలా? మరీ ఇంత మ్యాచ్ ఫిక్సింగ్ అని ప్రశ్నించారు. మీ జెండా, అజెండా అంతా చంద్రబాబు కోసమే అని నిలదీశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వని అధికారంలో ఉన్న చంద్రబాబును ప్రశ్నించాల్సింది పోయి, సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చిన వైఎస్ జగన్ మీద విమర్శలు చేయడమేంటని వైఎస్ షర్మిలపై వరుదు కల్యాణి మండిపడ్డారు. అఘాయిత్యాలకు ఆడపిల్లలు బలైపోతుంటే ఎందుకు నోరు కూడా మెదపలేదు.. చంద్రబాబును ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు.దివంగత నేత వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకానికి మరింత వన్నెలద్ది, దాన్ని మరింత పటిష్టంగా జగన్ అమలు చేశారని స్పష్టం చేశారు. ఈ పథకం అమలు విషయంలో తండ్రి కంటే మరో నాలుగు అడుగులు ముందుకేశారని గణాంకాలే చెబుతున్నా యని వివరించారు. కోర్సులకు ఎంత ఖర్చయితే అంతా సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే పూర్తి ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం ఏడాదిపాటు వేచి చూడాల్సిన అవసరం లేకుండా ప్రతి మూడు నెలలకోసారి చెల్లింపులు చేశారని పేర్కొన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వం బకాయిపెట్టిన రూ.1778 కోట్లను చెల్లించడంతో పాటు, విద్యా దీవెన, వసతి దీవెనల కింద మొత్తంగా రూ.18,663 కోట్లు చెల్లించి విద్యార్థులకు, పేద కుటుంబాలకు అండగా నిలిచారని అన్నారు. ఇవన్నీ వాస్తవాలు అయితే, మీరు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని షర్మిలపై మండిపడ్డారు. కేవలం పొలిటికల్ డైవర్షన్‌కోసమే కదా ఇది అని ఆగ్రహం వ్యక్తం చేశారు.2024 సంవత్సరానికి సంబంధించి జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలకు సంబంధించిన ఫీజులను ఏప్రిల్, మే నెలలో ఇవ్వాల్సి ఉందని వరుదు కల్యాణి తెలిపారు. ఎన్నికల కోడ్‌ను సాకుగా చూపి చంద్రబాబు ఫిర్యాదు చేయడంతో వాటి విడుదల నిలిచిపోయిందని అన్నారు. ఆతర్వాత ఏప్రిల్ జూన్ త్రైమాసికం, జులై-ఆగస్టు-సెప్టెంబరు త్రైమాసికంగా, మొత్తంగా మూడు త్రైమాసికాలకు సంపూర్ణ ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద దాదాపుగా రూ.2100 కోట్లు చెల్లించాల్సి ఉందని అన్నారు. కాని ఇప్పటివరకూ చెల్లించని చంద్రబాబును నిలదీయకుండా జగన్ మోహన్ రెడ్డిని ప్రశ్నించడం వెనుక మీ ఉద్దేశాలు ఏంటని షర్మిలను నిలదీశారు. ఇది టీడీపీతో మీకున్న మ్యాచ్ ఫిక్సింగ్ కాదంటారా అని ప్రశ్నించారు.వసతి దీవెన కింద ఇచ్చే పిల్లల హాస్టల్ ఫీజులకూ ఎన్నికల కోడ్ అడ్డం రాడంతో మార్చి-ఏప్రిల్‌లో చెల్లించాల్సిన రూ.1,100 కోట్లు నిలిచిపోయాయని వరుదు కల్యాణి తెలిపారు. మరో విడత కూడా దగ్గరపడుతోందన్నారు. పిల్లల చదువులు, హాస్టల్ ఫీజుల కింద చంద్రబాబు ఫీజురీయింబర్స్‌మెంట్, హాస్టల్ ఫీజుల కింద ఈ రెండింటికి కలిపి ఇప్పటివరకూ పడ్డ బకాయిలు రూ.3200 కోట్ల పై మాటే అని అన్నారు. పథకాలకు పేర్లు అయితే మార్చారు కాని అధికారంలోకి వచ్చి ఐదు నెలలు అవుతున్నా.. ఒక్కపైసా ఇవ్వలేదని తెలిపారు. మరి మీరు ప్రశ్నించాల్సింది ఎవర్ని అని షర్మిలను ప్రశ్నించారు. డబ్బులు ఇవ్వాల్సిన చంద్రబాబునా? లేక పథకాలను సమర్థవంతంగా అమలు చేసిన జగన్‌నా? అని నిలదీ శారు.కేవలం చంద్రబాబును కాపాడాలన్న తపనకొద్దీ తప్పుడు ఆరోపణలు ఎందుకు చేస్తున్నారని షర్మిలను వరుదు కల్యాణి ప్రశ్నించారు. ఒక రాజకీయపార్టీగా మీకు అజెండా ఉందా? లేక బాబుగారి అడుగులకు మడుగు లొత్తడం, ఆయన కోసం డైవర్షన్ పాలిటిక్స్ చేయడమే మీ అజెండానా? అని నిలదీశారు. జగన్ మోహన్ రెడ్డిగారి మీద మీకు అంత అసూయ ఎందుకు ? అని అడిగారు

## సీఆర్‌పీఎఫ్ పాఠశాలలకు బాంబు బెదిరింపులు

న్యూఢిల్లీ, దేశవ్యాప్తంగా ఉన్న సీఆర్‌పీఎఫ్ పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. కేవలం భయపెట్టేందుకే కొందరు నకిలీ ఇ-మెయిల్‌ను పంపి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. కొన్ని పాఠశాలల గదుల్లో పేలుడు పదార్థాలు ఉంచామని, ఉదయం 11 గంటల్లోపు అన్ని స్కూళ్లను ఖాళీ చేయాలని దుండగులు అందులో హెచ్చరించారు. ఇదిలా ఉంటే.. ఆదివారం ఉదయం దిల్లీలోని రోహిణి ప్రాంతంలో ఉన్న సీఆర్‌పీఎఫ్ పాఠశాల సమీపంలో భారీ పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. పేలుడు తీవ్రతకు ఆ ప్రాంతంలో దట్టమైన పొగ వ్యాపించింది. పాఠశాల గోడ కూలిపోవడంతోపాటు సమీపంలో ఉన్న దుకాణాలు, కార్లు దెబ్బతిన్నాయి. సమీపంలోని మట్టి, అక్కడ గుర్తించిన తెల్లని పౌడర్ నమూనాలనూ ల్యాబ్‌కు పంపించారు. జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ), జాతీయ భద్రతా దళం (ఎన్ఎస్‌జీ) ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టాయి. ఇక్కడ ఎన్ఎస్‌జీ రోబోలను మోహరించింది. ఇటీవలికాలంలో బాంబు బెదిరింపులు ఓ సమస్యగా మారాయి. గత కొద్దిరోజులుగా విమానయాన సంస్థలకు ఈ బూటకపు సందేశాలు ఎక్కువయ్యాయి. దాంతో విమానాల రాకపోకలపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇటు ప్రజలు భయభ్రాంతులకు లోనవుతున్నారు. విమానయాన భద్రతే ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తెలిపారు.

# నానాటికీ క్షీణిస్తున్న రాజకీయ విలువలు



హైదరాబాద్,రాజకీయాల్లో పదవులు, హోదాలు అలంకారప్రాయం కాదు.. బాధ్యతతో కూడినవి. అందునా రాజ్యాంగబద్ధ పదవులు మరింత బృహత్తరమైనవి. ఈ పదవి ఒక సమూహానికో, వర్గానికో పరిమితం కాదు. మొత్తం శాసనవ్యవస్థకు ప్రతీక. ప్రజాస్వామ్య ఔన్నత్యాన్ని పరిరక్షించే గొప్ప బాధ్యత. ఇలాంటి సమున్నత పదవుల్లోని వ్యక్తులు రాజ్యాంగ విలువలు, సూత్రాలతోపాటు, నైతిక విలువలకూ ప్రాధాన్యం ఇవ్వాలి. సమాజానికి ఆదర్శంగా నిలవాలి. భవిష్యత్ తరాలకు మార్గదర్శకం కావాలి. అలా కాకుండా, అధికారమే పరమావధి అనుకుంటే.. విలువలకు తిలోదకాలిస్తే రాజ్యాంగ స్ఫూర్తికే విఘాతం కలుగుతుంది. ప్రజాస్వామ్యం మనుగడ ప్రమాదంలో పడుతుంది. దురదృష్టవశాత్తు ఇటీవలి కాలంలో రాజకీయాలతోపాటు.. రాజకీయాలతో ముడిపడిన రాజ్యాంగబద్ధ పదవులూ తిరోగమిస్తున్నాయి. ఏకంగా పెద్దల సభల్లోనే నైతికత లోపిస్తోంది. పెద్దరికం చిన్నబోతోంది. ఈ అభిజాఢ్యం తెలంగాణ రాజకీయాల్లోనూ ప్రతిబింబిస్తోంది. ఇలాంటి పరిణామాలు ఎంతమాత్రం వాంఛనీయం కావని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు.సమకాలీన రాజకీయాల్లో నలభయ్యేళ్ల ప్రస్థానం సుదీర్ఘమనే చెప్పాలి. పైగా అన్నేళ్లు అధికారంలో కొనసాగడం గొప్పతనమే. గెలిచిన ప్రతీసారి కీలక హోదాలు.. పదవులు.. వివాదాలకు దూరంగా, సౌమ్యుడిగా అందరి మన్ననలు పొందడం నిజంగా అదృష్టమే. ఇలాంటి నేతలు అరుదుగా ఉంటారు. అలాంటి అరుదైన కొందరు నేతల్లో తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఒకరు.కమ్యూనిస్టు పార్టీ ద్వారా రాజకీయ ఆరంగేట్రం చేసిన ఆయన ఆ తర్వాత పార్టీలు మారినా, అంచెలంచెలుగా ఎదుగుతూ రాజకీయాల్లో తనకంటూ ఒక పత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. నల్గొండ జిల్లాకు చెందిన ప్రముఖ, అగ్రనేతల్లో ఒకడిగా చెరగని ముద్రవేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో కీలక పదవులు చేపట్టి రాష్ట్రస్థాయిలోనూ పార్టీలకు అతీతంగా గౌరవమన్ననలు పొందారు.1984లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రస్థానం ప్రారంభించిన ఆయన పలుమార్లు ఎంపీగా గెలుపొందారు. ముఖ్యంగా తెరాస, భారస ప్రభుత్వాలలో రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా, శాసన మండలి సభ్యుడిగా, మండలి చైర్మన్‌గా రాజ్యాంగబద్ధ పదవిని అధిష్టించారు. పెద్దల సభలో పెద్దరికం స్థాయికి చేరారు.. అయితే, ఇక్కడే ఆయన విమర్శలకు గురవుతున్నారు. రాజ్యాంగబద్ధ పదవిలో నైతిక విలువలను విస్మరిస్తున్నారనే ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. మహోన్నత బాధ్యతల్లో ఉండి, రాజకీయ పరమైన వ్యాఖ్యలు, ఒక పార్టీకి కొమ్ముకాసే ప్రకటనలు ఆయనపై వివాదాస్పద ముద్ర పడేలా చేస్తున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.రాజకీయం వేరు.. పదవులు.. బాధ్యతలు వేరు.. ప్రజాస్వామ్యంలో వేటికవే ప్రత్యేకమైనవి. ఒక నాయకుడిగా ప్రజలతో మమేకమవుతూ, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడం కర్తవ్యం. అలాగే, తనకు అవకాశాలు కల్పించిన, ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీకి విధేయతగా మెలగడం కూడా అవసరమే.ఈ క్రమంలో పరిణితితో, విజ్ఞతగా వ్యవహరించే నేర్పును ప్రదర్శించాలి. ఏ ఎండకా గొడుగు పట్టాల్సి వచ్చినా, నైతికత చట్రం పరిధిని దాటకుండా చూసుకోగల గాలి. లేదంటే ఇనేళ్లలో వచ్చిన పేరు ప్రతిష్టలు, గౌరవ మర్యాదలు అపఖ్యాతికి గురయ్యే ప్రమాదముంది.తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలలో ఎంపీగా మూడ పర్యాయాలు గుత్తా సుఖేందర్ రెడ్డి కీలక బాధ్యతలు నిర్వర్తించారు. ఎంపీగా ఉన్న సమయంలో పట్టణ, గ్రామీణాభివృద్ధి, సమాచారం, ప్రసారాలు, ఇంధనం, రైల్వేలు, వాణిజ్యం మొదలైన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీలలో సభ్యుడిగా పనిచేశారు. జాతీయ స్థాయి గుర్తింపు పొందారు. నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్‌గానూ (1998) సేవలు అందించారు. ఈ ప్రస్థానంలో అంచెలంచెలుగా ఎదిగిన ఆయన, వివాద రహిత, విలువలతో కూడిన నాయకుడిగా మన్ననలు అందుకు న్నారు.కండువా మారింది.. స్వరం మారిందికానీ, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గుత్తా సుఖేందర్‌రెడ్డి వైఖరిలో మార్పుకనిపించింది. కాంగ్రెస్ ఎంపీగా నాటి తెరాస ప్రభుత్వంపై గట్టిగానే పోరాడారు. తెరాస ప్రభుత్వం తీసుకొచ్చిన పార్లమెంటరీ కార్యదర్శుల పదవులకు వ్యతిరేకంగా న్యాయపోరాటం కూడా కొనసాగించారు.ఆ తర్వాత అనూహ్యంగా కల్వకుంట్ల చంద్రశేఖరరావుకి దగ్గరయ్యారు. తెరాసలో చేరిపోయారు. పార్టీ ఫిరాయించిన సందర్భంలో ఎంపీ పదవికి రాజీనామా చేయలేదు. దీనిపై విమర్శలు కూడా ఎదుర్కొన్నారు. ఇక ఎంపీగా పదవీకాలం ముగింపు దశలో కేసీఆర్ ఆయనకు మరో కేబినెట్ హోదాతో పదవిని కట్టబెట్టారు. తెలంగాణ రాష్ట్ర రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా నియమించారు. ఆ తర్వాత 2019 ఆగస్టులో ఎమ్మెల్సీగా ఎన్నికై, మండలి చైర్మన్‌గా మూడేళ్లు అధికారంలో కొనసాగారు. మళ్లీ 2021లోనూ అదే పార్టీనుంచి ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ అయ్యారు.మరోసారి మండలి చైర్మన్ బాధ్యతల్ని చేపట్టారు.రాజ్యాంగ పదవికేదీ గౌరవం?రాజ్యాంగ పదవుల్లో ఉన్నవాళ్లు కండువాలు మార్చాల్సిన అవసరం లేదంటూ కొన్నాళ్ల కిందట గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. నిజమే శాసనసభాపతుల స్థానం రాజ్యాంగ బద్ధమైనది. పార్టీలకు అతీతమైన బాధ్యతలతో కూడినది. ఇక్కడ కండువాలతో పనిలేదు.

# దక్షిణాదిలో పాగాయే లక్ష్యం!





హైదరాబాద్,భారతదేశంలో జమిలి ఎన్నికలకు రంగం సిద్ధమవుతోన్న వేళ బీజేపీ అధినాయకత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. పార్టీ నాయకత్వంలో భారీ మార్పులు చోటు చేసుకోబోతున్నాయన్న చర్చ బీజేపీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డా పదవీ కాలం ముగియడంతో.. ఆయన వారసుడిని ఎంపిక చేసే పనిలో పార్టీ పెద్దలు నిమగ్నమయ్యారు. అదే క్రమంలో దక్షిణాది రాష్ట్రాలపై పట్టు సాధించేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వాస్తవానికి దక్షిణాది రాష్ట్రాలపై పట్టు సాధించడం బీజేపీ బిగ్ ఛాలెంజ్ అనడంలో సందేహం లేదు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ హవా సాగుతున్నా.. దక్షిణాది రాష్ట్రాలలో మాత్రం బీజేపీ పరిస్థితి ఒక అడుగు ముందుకు రెండడుగులు వెనక్కు అన్నట్లుగానే ఉంది. ప్రాంతీయ పార్టీలతోపాటు.. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ దక్షిణాది రాష్ట్రాల్లో కాస్త బలంగానే ఉంది. బీజేపీ మాత్రం దక్షిణాది రాష్ట్రాలలో కాలూనడానికే నానా ఆపసోపాలు పడుతోంది. ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో దక్షిణ రాష్ట్రాల్లో బీజేపీ పెద్దగా ప్రభావం చూపలేక పోయింది. ఆ రాష్ట్రాల్లో ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్, డిఎంకె, ఎఐఎడిఎంకె, తెలుగుదేశం, వైసీపీ, బీఆర్ఎస్ వంటి ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్నాయి. అయితే, 2027లో జమిలి ఎన్నికల ఊహాగానాల నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలపై పట్టు సాధించాలని బీజేపీ, ఆర్ఎస్ఎస్ పెద్దలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారట.దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటకలో బీజేపీ ఓ మోస్తరు విజయాన్ని సాధించగా.. కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి రాష్ట్రాల్లో పెద్దగా ప్రభావం చూపలేదు. కర్ణాటకలో గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారాన్ని కోల్పోయింది. తెలంగాణలో ఇప్పుడిప్పుడే బలమైన పార్టీగా ఎదిగేందుకు ప్రయత్నాలు చేస్తోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో ఎనిమిది పార్లమెంట్ స్థానాలను బీజేపీ గెలుచుకుంది. అయితే, ఎన్నికల తరువాత అదే ఊపును కొనసాగించడంలో మాత్రం విఫలమైంది. ఇక ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే ప్రాంతీయ పార్టీలతో కలిసి అధికారంలో భాగస్వామ్య పార్టీగా ఉంది. వాస్తవానికి ఏపీలో బీజేపీకి పెద్దగా బలం లేదు.తెలుగుదేశం, జనసేన పార్టీల అండతో ఆ పార్టీ అభ్యర్థులు కొందరు గత ఎన్నికల్లో విజయం సాధించారు. తమిళనాడు రాష్ట్రంలో గత పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ ఒక్కటంటే ఒక్క సీటు కూడా గెలుచుకోలేక పోయింది. ఈ క్రమంలో రాబోయే కాలంలో దక్షిణాది రాష్ట్రాలపై బలమైన ముద్ర వేసేందుకు బీజేపీ అధిష్టానం, ఆర్ఎస్ఎస్ నేతలు కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. బీజేపీ పగ్గాలను దక్షిణాది నేతకు అప్పగించే ఆలోచనలో పార్టీ పెద్దలు ఉన్నారని బీజేపీ నేతలే అంటున్నారు. ఈ క్రమంలో బీజేపీ అధ్యక్ష పదవికి పార్టీ అధిష్ఠానం వారణాసి రామ్ మాధవ్, వెల్లంవెల్లి మురళీధరన్ పేర్లను పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. అనుభవజ్ఞులైన వ్యూహకర్తలుగా వారిద్దరికి పేరుంది. బీజేపీకి జాతీయ స్థాయిలో నాయకత్వం వహించే సమర్థత కలిగిన వారిగా పార్టీ అధిష్టానం సైతం వారిని గుర్తించింది. వారిలో ఒకరికి పార్టీ బాధ్యతలు అప్పగిస్తే దక్షిణాది రాష్ట్రాల్లోనూ రాబోయే కాలంలో బీజేపీని బలోపేతం చేయొచ్చునని బీజేపీ, ఆర్ఎస్ఎస్ పెద్దల వ్యూహంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. దేశ రాజకీయాలు ప్రస్తుతం జమిలి ఎన్నికల చుట్టూ తిరుగుతున్నాయి. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఒకేసారి ఎన్నికలను నిర్వహించాలని కేంద్రం భావిస్తోంది. దీనికి తోడు ఇందుకు అవసరమైన రాజ్యాంగ సవరణలు చేసేందుకు కేంద్రం సిద్ధమైంది. కేంద్రం దూకుడు చూస్తుంటే 2027లో జమిలి ఎన్నికలను నిర్వహించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఇదే జరిగితే బీజేపీకి ఉత్తరాదిలోనే కాకుండా దక్షిణాదిలోనూ అత్యధిక పార్లమెంట్ స్థానాలతో పాటు.. రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం సవాలుగానే ఉంటుంది. ఈ పరిస్థితుల్లో దక్షిణాది రాష్ట్రాల నేతకు పార్టీ పగ్గాలు అప్పగించడం ద్వారా మంచి ఫలితాలను రాబట్టచ్చుని బీజేపీ పెద్దలు యోచిస్తున్నారు. ఈ క్రమంలోనే రామ్ మాధవ్, వెల్లంపల్లి మురళీర్ వంటి అనుభవజ్ఞులైన వారిలో ఒకరికి జాతీయ స్థాయిలో పార్టీ పగ్గాలు అప్పగించేందుకు బీజేపీ పెద్దలు ఆలోచన చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతుంది. దక్షిణాది నేతకు జాతీయ స్థాయిలో పార్టీ బాధ్యతలు అప్పగిస్తే.. బీజేపీ కేవలం ఉత్తర భారతదేశం పార్టీ అనే అపవాదును తుడిచేసినట్లవుతుంది. దక్షిణాది ప్రజల సమస్యలు, సంస్కృతి సాంప్రదాయాలను బీజేపీ గౌరవిస్తుందన్న నమ్మకాన్ని ఆ ప్రాంత ప్రజల్లో కలిగించినట్లు అవుతుంది. దీనికి తోడు ఇటీవల కాలంలో దక్షిణాది రాష్ట్రాల్లో ప్రధాని నరేంద్ర మోదీ తరుచుగా పర్యటిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధికి మోదీ పెద్దపీట వేస్తున్నారన్న భావన ఇప్పుడిప్పుడే ప్రజల్లో కలుగుతోంది. ఇదే సమయంలో దక్షిణాది నేతకు బీజేపీ పగ్గాలు అప్పగిస్తే పార్టీ బలోపేతానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని బీజేపీ, ఆర్ఎస్ఎస్ పెద్దలు భావిస్తున్నట్లు తెలుస్తోంది. రామ్ మాధవ్, మురళీధరన్ పేర్లను మాత్రమే బీజేపీ పెద్దలు ఎందుకు పరిగణలోకి తీసుకున్నారనే చర్చకూడా రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్)తో రామ్ మాధవ్ ప్రయాణం ఆయన టీనేజ్ నుంచే ఆరంభమైంది. 1981లో ఆర్ఎస్ఎస్‌లో పూర్తిస్థాయి కార్యకర్తగా మారడానికి రామ్ మాధవ్ స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. కొన్ని సంవత్సరాలుగా ఆర్ఎస్ఎస్ పెద్దలు తీసుకునే నిర్ణయాల్లో కీలక భూమిక పోషిస్తున్నారు. మాధవ్ 2003 నుండి 2014 వరకు ఆర్ఎస్ఎస్ సంస్థ జాతీయ ప్రతినిధిగా కొనసాగారు. 2014లో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగానూ పనిచేశారు. పార్టీ ప్రధాన కార్యదర్శి హోదాలో పార్టీని బలోపేతం చేయడంలో రామ్ మాధవ్ నిర్ణయాలు కీలక భూమిక పోషించాయి. అంతేకాక.. ఈశాన్య భారతదేశంలో పార్టీ అభివృద్ధికి ప్రాంతీయ పార్టీలతో పొత్తులను బలోపేతం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. మరోవైపు మురళీధరన్ కు జాతీయ స్థాయిలో పార్టీలో మంచిపట్టు ఉంది. మురళీధరన్ 1998లో లోక్‌సభ ఎన్నికల సమయంలో వెంకయ్య నాయుడుకు సహాయం చేస్తూ బీజేపీలోకి ప్రవేశించారు. 1999లో నెహ్రూ యువకేంద్ర వైస్ చైర్మన్‌గా నియమితులైన ఆయన, ఆ తర్వాత బీజేపీ ఎన్‌జీవో, శిక్షణా విభాగాల జాతీయ కన్వీనర్‌గా కీలక పాత్రలు నిర్వహించారు. బీజేపీ కేరళ ఉపాధ్యక్షుడిగా (2006-2010) పనిచేసిన ఆయన.. సైద్ధాంతిక శిక్షణపై దృష్టి సారించారు. 2010, 2013లో కేరళ బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన ఆయన పార్టీ సభ్యత్వం, పార్టీ ఓట్ల శాతాన్ని పెంచారు. 2018లో రాజ్యసభ ఎంపీ అయ్యారు. కేంద్ర మంత్రిగా పనిచేశారు. మాధవ్, మురళీధరన్ ఇద్దరూ పార్టీ జాతీయ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించేందుకు సమర్థత కలిగిన వారు. అయితే, బీజేపీ పెద్దలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారు, జమిలి ఎన్నికల సమయం నాటికి దక్షిణాదిలో బీజేపీ ప్రభావాన్ని పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారనే అంశాలు ఆసక్తికరంగా మారాయి.

## చంద్రబాబుది ఎప్పుడూ ముందు చూపే

అమరావతి,సీఎం చంద్రబాబు ఎప్పుడూ కొత్త కొత్త ఆలోచనలు చేస్తుంటారని, భవిష్యత్ ఎలా ఉంటుందో ముందే ఊహిస్తారని డ్రోన్ సమ్మిట్ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. యువతతో పోటీపడి ఆయన పనిచేస్తుంటారు. నూతన సాంకేతికత వినియోగంపై చర్చలు జరుపుతుంటారు. దేశాభివృద్ధికి ఎప్పుడూ ఆలోచనలు చేస్తున్న వ్యక్తి ప్రధాని నరేంద్ర మోదీ. ప్రపంచంలోని అన్ని దేశాలు భారత్ సాధిస్తున్న అభివృద్ధిని పరిశీలిస్తున్నాయి. దేశంలో 74 ఎయిర్‌పోర్టుల నుంచి గత పదేళ్లలో 157కు పెరిగాయి. వచ్చే 20 ఏళ్లలో 200కుపైగా ఎయిర్‌పోర్టులు వస్తాయి. విమానాల్లో ప్రయాణికుల సంఖ్య పెరుగుతోందని అన్నారు. దేశంలో మొదటిసారి డ్రోన్ సమ్మిట్ ఢిల్లీ బయట జరుగుతోందని రామ్మోహన్ నాయుడు అన్నారు. నేను మంత్రిని అయ్యాక చాలా మంది ముఖ్యమంత్రులు ఎయిర్‌పోర్టులు, హెలిపోర్టుల గురించి అడిగారు. అయితే ఏపీ ముఖ్యమంత్రి మాత్రం ఎయిర్‌పోర్టులతో పాటు కనెక్టివిటీ, డ్రోన్ల ప్రాధాన్యం గురించి మాట్లాడారని తెలిపారు. అయితే చంద్రబాబు మాత్రం అందుకు భిన్నమని అంటూ పొగడ్తలతో ముంచెత్తారు. అందుకు డ్రోన్ సమ్మిట్ ఏర్పాటే నిదర్శనమని అన్నారు. ఇంత మంచి వాతావరణంలో డ్రోన్ సమ్మిట్ కోసం ఏర్పాటు చేయడం పట్ల ఏపీ ప్రభుత్వానికి, సీఎం చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. హైదరాబాద్ భవిష్యత్తును విజన్ చేసి విజన్ 2020 గురించి ఆలోచించారని.. 1996 నాడే ఆయన 2020 గురించి ఆలోచించారని తెలిపారు. వచ్చే ఎన్నికల గురించి చంద్రబాబు ఆలోచించరని.. భవిష్యత్తును ఊహిస్తారని చెప్పారు. అందుకే హైదరాబాద్ అన్ని రంగంగాల్లో నేడు అభివృద్ధి చెందిందని ప్రశంసించారు. 1996లో చంద్రబాబు హైదరాబాద్ గురించి ఎలా మాట్లాడారో అలాగే ఇప్పుడు అదే జీల్‌తో డ్రోన్ గురించి మాట్లాడుతున్నారని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వంలో క్యాబినెట్ మినిస్ట్రీలో ఒక యువకుడికి అవకాశం ఇవ్వాలని భావించి.. తనకు కేంద్రమంత్రి పదవి ఇచ్చారని చెప్పుకొచ్చారు. డ్రోన్ నెట్‌వర్క్‌లో ఎంతో పొటన్షియల్ ఉందని ఆయన గుర్తించారన్నారు. విజయవాడలో వరదల సమయంలో డ్రోన్‌లను సహాయ కార్యక్రమాలకు, ఫుడ్ సప్లైకి వాడారన్నారు. డ్రోన్ ద్వారా ఆహారం, పాలు, మందులు అందించారని తెలిపారు. డ్రోన్‌లను ఇలా వాడడాన్ని ప్రధాని మోడీ కూడా చూసి ఆనందించారని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ ఇండియాను ప్రపంచంలోనే గొప్ప పొజిషన్‌లో నిలిపారని కొనియాడారు. ఇండియాను చూసి నేర్చుకోవాలని వివిధ దేశాల నాయకులు అనుకుంటున్నారన్నారు. గత పది సంవత్సరాలుగా సివిల్ ఏవియేషన్‌లో ఎన్నో అద్భుతాలు జరిగాయన్నారు. డ్రోన్‌లో వర్టికల్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ వంటి సాంకేతిక పరిజ్ఞానం వచ్చిందన్నారు. ఇలాంటి కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏపీకి తేవాలని సీఎం చంద్రబాబు ఆలోచిస్తారన్నారు. ఈ డ్రోన్ సెక్టర్‌లో ఇక్కడి వారు ముందుకు రావాలని.. నిర్మాణాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అందుకే డ్రోన్ రూల్స్ 2021ను చాలా సరళతరం చేశామని వెల్లడించారు. దీనికి అదనంగా డ్రోన్ పరిశ్రమలకు ప్రోత్సాహం ఇస్తున్నామని.. డ్రోన్ ఇండస్ట్రీపై మరింత రీసెర్చి జరగాలనేది తమ అభిమతమన్నారు. 26,500 డ్రోన్‌లు రిజిస్టర్ అయి ఉంటే ప్రధాని దాన్ని లక్షకు చేర్చాలని చెప్పారన్నారు. డ్రోన్ దీదీ ప్రోగ్రాం ద్వారా దేశంలో మహిళలకు ఉపాధి కూడా కలుగుతోందన్నారు. ఏపీ ఇప్పుడు డ్రోన్ పాలసీని రూపొందిస్తోందని.. అందరితో మాట్లాడి దాన్ని రూపొందించడంతో ఇదే బెస్ట్ పాలసీ అవుతుందని స్పష్టం చేశారు. 6000 మంది కంటే ఎక్కవ మంది ఈ ఈవెంట్‌లో పాల్గొనాలని ఉత్సాహం చూపారన్నారు. ఇండియాలోనే కాదు ప్రపంచానికే ఏపీ డ్రోన్ హబ్‌గా మారాలని కోరుతున్నానని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌కు రక్ష

న్యూఢిల్లీ, మోడీ తీసుకున్న కాంగ్రెస్ ముక్త భారత్ నినాదాం పేలవంగా మారింది. ప్రజలు మోడీ పిలుపునకు పెద్దగా స్పందించడం లేదు. అందుకే మొన్నటి పార్టమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించారు. కేవలం మోడీ హామీలు నినాదాలుగా మారుతున్నాయి. విధానాలు అటకెక్కుతున్నాయి. బిజెపి కన్నా కాంగ్రెస్ మేలన్న వాదన మెల్లగా బలోపేతం అవుతోంది. మొన్నటి పార్లమెంట్ ఎన్నికల్లో చావుతప్పి కన్నులొట్టబోయిన చందంగా బిజెపి గెలిచింది. దీంతో ఎన్‌డిఎ మిత్రపక్షాల అండతో మోడీ గద్దెనెక్కారు. ఇప్పటికీ మోడీ తన విధానాలు మార్చుకోవడం లేదు. ఈ క్రమంలో ప్రాంతీయ పార్టీలు తేడా వస్తే మోడీని గద్దె దింపడానికి వెనకాడరు. మరోవైపు ప్రాంతీయ పార్టీలకు దర్యాప్తు సంస్థల పనితీరు దేశంలో జీవన్మరణ సమస్యగా మారింది. వివిధ కేసులతో ఆయా పార్టీల నేతలను వేధిస్తున్న తీరు కారణంగా అవి ఉనికిని కోల్పోయే ప్రమాదంలో పడ్డాయి. జార్ఖండ్, ఢిల్లీ ముఖ్యమంత్రులకు ఇడి వేధింపులు ఇందుకు ఉదాహరణగా చూడాలి. ఈ రెండు రాష్ట్రాల్లో అధికారాన్ని చేజిక్కించుకోవడం కోసం ఆమ్ ఆద్మీ పార్టీని, ఆ పార్టీ అధినేత ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను తుదముట్టించడం కోసం బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. నిజానికి అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో కాంగ్రెస్‌ను దెబ్బతీయడంలో బీజేపీకి సహాయపడ్డారు. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించగలిగారు. ఓ రకంగా కాంగ్రెస్ ముక్త నినాదానికి ప్రయత్నించారు. ఇలా రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు ఉనికిలేకుండా చేయగలిగారు.తన సంక్షేమ ఎజెండాయే దేశ వ్యాప్తంగా కాంగ్రెస్‌తో సహా ఇతర పార్టీలు అనుకరించేలా చేయగలిగారు. కాంగ్రెస్ బలహీనపడుతున్న కొద్దీ ఆప్ బలపడింది. అయినప్పటికీ మోదీ సకల ఆయుధాలు కేజ్రీవాల్‌పై ప్రయోగించడంతో ఆయన తన రాజకీయ అస్తిత్వం కోసం పోరాడుతున్నారు. ఆప్ జీవన్మరణ సమస్యలో ఉంది. ప్రాంతీయ పార్టీలు బలహీనపడితే వాటి స్థానంలో బలపడేందుకు కాంగ్రెస్‌కే ఎక్కువ ఆస్కారం ఉన్నది. ఎందుకంటే కాంగ్రెస్ ఓటు బ్యాంకునే ప్రాంతీయ పార్టీలు అధికంగా కొల్లగొట్టాయి. బీజేపీ క్రియాశీలకంగా మారడానికి ముందే ప్రజలు కాంగ్రెస్ పట్ల వ్యతిరేకతతో ప్రాంతీయ పార్టీలను ఆదరించారు. ఇవాళ దేశంలో ఉన్న అనేక ప్రాంతీయ పార్టీల పుట్టుకకు కాంగ్రెస్ అనుసరించిన విధానాలే కారణం. ఇప్పుడు మోదీ కూడా ప్రాంతీయ పార్టీలను బలహీనపరిస్తే చివరకు ప్రధాన పోటీ మళ్లీ బీజేపీ, కాంగ్రెస్‌లకే పరిమితం కావడం ఖాయం. లేదా ప్రాంతీయ పార్టీలె కాంగ్రెస్ గొడుగు కింద బలంగా మారుతాయి. కాంగ్రెస్ ముక్త భారత్ లక్ష్యం సాధించడం కష్టమని గ్రహించినందువల్లే మోదీ ప్రాంతీయ పార్టీలను లక్ష్యంగా పెట్టుకున్నారా? అన్న అనుమానాలకు ఆస్కారం లేకపోలేదు. ఏమైనా అటు బీజేపీ, ఇటు కాంగ్రెస్ మధ్య ప్రాంతీయ పార్టీలు నలిగిపోయే పరిస్థితి పలు రాష్ట్రాల్లో కనిపిస్తోంది. బిజెపి పనితీరు సక్రమంగా లేకపోవడం వల్లనే కర్నాటక, తెలంగాణలో ప్రజలు కాంగ్రెస్‌ను ఆదరించారు. కర్నాకటలో బిజెపి కరప్షన్ కారణంగా ప్రజలను దూరం చేసుకుంది. తెలంగాణలో కెసిఆర్ అహంకారాన్ని అణచివేసేందుకు ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకున్నారు. లోకసభ ఎన్నికలకోసం మోడీ అవినీతి అంశాలన్ని ఒక ప్రయోగంగా ఉపయోగించుకుంటున్నారా అన్నది చర్చనీయాంశమవుతోంది. 2014లో లోకసభ ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరుకున్న దశలో నరేంద్రమోదీ ఈ దేశాన్ని కాంగ్రెస్ నుంచి విముక్తం చేయాలని పిలుపు

# పదిహేను రోజులలో అమిత్ షా తో రెండు భేటీలు...మ్యాటరేంటి ?



న్యూఢిల్లీ,బీజేపీలో కేంద్రంలో అత్యంత బలమైన శక్తివంతమైన నాయకుడు ఎవరు అంటే ఠక్కున చెప్పే పేరు అమిత్ షా. ఆయన కేంద్ర హెూంమంత్రి. మోడీ అమిత్ షా ఒక సక్సెస్ ఫుల్ జోడీ. కేంద్ర మంత్రిగా అమిత్ షా వ్యూహరచనా చతురుడు అని చెప్పాలి. ఆయన బీజేపీ మిత్రులతో సాన్నిహిత్యాన్ని కొనసాగించడమే కాకుండా వారి విషయంలో ఎప్పటికప్పుడు భేటీలు అవుతూ బంధాలను బలోపేతం చేసుకుంటూంటారు. ఇక తెలుగుదేశం విషయానికి వస్తే 2014 నుంచి 2018 దాకా కొనసాగిన బంధం అప్పట్లో తెగిపోయింది. ఆ మధ్యలోకి జగన్ వచ్చి చేరారు. ఫలితంగా 2019లో ఘోర పరాజయం కూడా టీడీపీని పలకరించింది. 2024 ఎన్నికల్లో మాత్రం ఆ తప్పు చేయకుండా టీడీపీ ముందే జాగ్రత్త పడింది. బీజేపీతో పొత్తుని కొనసాగించడం వల్ల కలిగిన గరిష్ట లాభం ఏమిటో కూడా తెలుసుకుంది. ఇక జమిలి ఎన్నికలు వచ్చినా లేదా షెడ్యూల్ ప్రకారమే 2029లో ఎన్నికలు వచ్చినా కూడా బీజేపీతో కలసే ఎన్నికలకు వెళ్లాలన్నది తెలుగుదేశం విధానంగా మారింది. ఇవన్నీ పక్కన పెడితే ఈ నెల మొదటి వారం అంటే 7న ఢిల్లీ వెళ్ళిన చంద్రబాబు రెండు రోజుల పాటు అక్కడ బిజీగా గడిపారు. ఈ సందర్భంగా ఆయన అమిత్ షాతో సుదీర్ఘ భేటీ వేశారు. ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాల మీద చర్చతో పాటు రాజకీయాల గురించి కూడా చర్చలు జరిగే ఉంటాయని అంటున్నారు. పైగా టీడీపీ ఎన్డీయే కూటమిలో అతి ముఖ్య భాగస్వామి కావడంతో బీజేపీ కూడా టీడీపీ చెప్పేది వింటుంది అని అంటున్నారు. చంద్రబాబు ఏపీలో కూటమి మరింత బలంగా నిలిచేందుకు అవసరమైన సలహా సూచనలు చెబుతూనే విపక్ష వైసీపీ విషయంలోనూ అమిత్ షాతో చర్చించి ఉంటారని అంటున్నారు. జగన్ టార్గెట్ గా ఏపీలో పాలిటిక్స్ చేస్తున్న టీడీపీకి కేంద్రం అండ కావాలని అంటున్నారు. ఆ మేరకే చర్చించి ఉంటారని కూడా చెబుతున్నారు. ఇక సీన్ కట్ చేస్తే మంత్రి నారా లోకేష్ ఢిల్లీ టూర్ పెట్టుకున్నారు. ఆయన కూడా పలువురు కేంద్ర మంత్రులను కలిసారు. వీటన్నిటికంటే విశేషం ఏంటి అంటే కేంద్ర మంత్రి అమిత్ షాని కలవడం. ఆయనతో లోకేష్ గంటన్నర పాటు సమావేశం జరపడం. గతంలో లోకేష్ అమిత్ షాను కలిశారు కానీ మంత్రిగా కాదు. చంద్రబాబు అరెస్ట్ అయి జైలులో ఉన్నపుడు ఆయన కేంద్ర మంత్రిని కలిసారు. ఈసారి అలా కాదు కూటమిలో ముఖ్య మిత్రపక్షం అయిన టీడీపీ భావి నేతగా. ఏపీలో పవర్ ఫుల్ లీడర్ వారసుడిగా రైజింగ్ పొలిటీషియన్ గా ఉన్న నార లోకేష్ అమిత్ షాను కలవడం అంటే దానిని విశేషంగా చూస్తున్నారు. ఈ సందర్భంగా కూడా కచ్చితంగా రాజకీయ చర్చలు జరిగి ఉంటాయని అంటున్నారు. ఏపీలో గత అయిదేళ్ళ వైసీపీ హయాంలో వ్యవస్థలను ఎలా ఇబ్బంది పెట్టారో నాశనం చేశారో లోకేష్ వివరించారని ప్రచారం సాగింది. ఇక బీజేపీ టీడీపీల ఉమ్మడి శత్రువుగా జగన్ ని చేసినట్లు అయితేనే ఏపీలో వైసీపీని పూర్తి స్థాయిలో అడ్డుకోవడం జరుగుతుందని అంటున్నారు. బీజేపీ అయితే ఈ రోజుకీ టీడీపీ జనసేనలనే పూర్తిగా నమ్ముకుంది. కానీ రాజకీయాలు ఎపుడూ ఒకేలా ఉండవు. రేపటి రోజు పరిణామాలు ఎలా ఉంటాయో కూడా ఎవరూ ఊహించలేరు. దాంతో పాటు వైసీపీ బీజేపీ గతంలో పరోక్ష చెలిమిని నడిపారు. బీజేపీ తన పొలిటికల్ స్ట్రాటజీ కే టాప్ ప్రయారిటీ ఇస్తుంది. దాంతో టీడీపీ బీజేపీకి ఉమ్మడి శత్రువుగా జగన్ ని ఎంతవరకూ ఉంచగలిగారు అన్న దానిని అంచనా వేయాలీ అంటే రాబోయే రోజులలో చోటు చేసుకోబోయే పరిణామాలే దానిని చెబుతాయని అంటున్నారు. జగన్ ఇండియా కూటమి వైపే అని పూర్తిగా ఎస్టాబ్లిష్ చేయగలిగితే బీజేపీ నుంచి గట్టి ముప్పే వైసీపీకి ఉంటునని కూడా అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌ను ఎన్‌కౌంటర్ చేయండి

న్యూఢిల్లీ,గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌ను ఎన్‌కౌంటర్ చేస్తే రూ. 1,11,11,111 రివార్డు ఇస్తామంటూ కర్ణిసేన బహిరంగంగా ప్రకటించింది. క్షత్రియ కర్ణిసేన జాతీయ అధ్యక్షులు రాజ్ షేకావత్ ఈ మేరకు ఓ వీడియో విడుదల చేశారు. ప్రస్తుతం రాజ్ షెకావత్‌కు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. లారెన్స్ బిష్ణోయ్‌ని ఎన్‌కౌంటర్ చేసిన పోలీసుకు కోటి 11లక్షల 11వేల 11వందల 11 రూపాయిల రివార్డ్ ఇస్తామని తెలిపారు. కర్ణిసేనకు చెందిన సుఖ్‌దేవ్ సింగ్ గోగమేడి హత్యకు సూత్రధారుడు, పాత్రధారుడు లారెన్స్ బిష్ణోయ్ అంటూ రాజ్ షేకావత్ వీడియోలో పేర్కొన్నారు. అదే సమయంలో దేశ ప్రజలకు భయం లేని భారతదేశం కావాలని పిలుపునిచ్చారు. ప్రజలు భయం లేకుండా జీవించాలంటే లారెన్స్ బిష్ణోయ్ వంటి వ్యక్తులు ఉండకూడదని తెలిపారు. ప్రజలను భయపెట్టే వ్యక్తులతో దేశానికి ఎప్పుడూ ప్రమాదమేనన్నారు. బిష్ణోయ్ గ్యాంగ్ అరాచకాలు వెలుగులోకి రావడంతో ప్రస్తుతం కర్ణిసేన లారెన్స్ బిష్ణోయ్‌ను లక్ష్యంగా చేసుకుంది. ఆ సంస్థ జాతీయ అధ్యక్షులు మాట్లాడుతు న్నట్లు ఉన్న వీడియో సోషల్ మీడియాలో కలకలం రేపుతోంది. కర్ణిసేనకు చెందిన సుఖ్‌దేవ్ సింగ్ గోగమేడి గత ఏడాది డిసెంబర్5న జైపూర్‌లో హత్యకు గురయ్యారు. ఆయన హత్యకు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన గోల్డీ బ్రార్ బాధ్యత వహించాడు. ఈమేరకు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. గోగమేడిని రెండు మూడు సార్లు హెచ్చరించినా వినలేదని.. దీంతో కాల్చి చంపినట్లు గోల్డీ బ్రార్ సోషల్ మీడియాలో వెల్లడించాడు. ఈ నేపథ్యంలో లారెన్స్ బిష్ణోయ్‌ను ఎన్‌కౌంటర్ చేస్తే పోలీసులకు కోటి రూపాయిల రివార్డు అందిస్తామంటూ కర్ణి సేనకు చెందిన రాజ్ షెకావత్ మాట్లాడారు. పలు కేసుల్లో దోషిగా ఉన్న లారెన్స్ బిష్ణోయ్ ప్రస్తుతం గుజరాత్‌లోని సబర్మతి జైలులో ఉన్నాడు. జైలు నుంచి పలు హత్యలకు బిష్ణోయ్ ఎలాన్ చేసినట్లు



తెలుస్తోంది. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఈ ఏడాది అక్టోబర్ 12న ఎన్సీపీ నాయకుడు బాబా సిద్ధిఖీని హత్య చేశారు. హీరో సల్మాన్ ఖాన్‌ను లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ చాలాసార్లు బెదిరించినట్లు వార్తలు వచ్చాయి. ఎన్నో హత్యలకు కారకుడైన లారెన్స్ బిష్ణోయ్ ఎన్‌కౌంటర్ విషయాన్ని కర్ణిసేన తెరపైకి తీసుకువచ్చింది. లారెన్స్ బిష్ణోయ్ 1993లో పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ జిల్లా ధత్తరన్‌వాలిలో పుట్టాడు. ఇతడి తండ్రి హరియాణా పోలీస్ కానిస్టేబుల్. కృష్ణ జింకలను అమితంగా ఆరాధించే బిష్ణోయ్ వర్గానికి చెందిన లారెన్స్ చండీగఢ్‌లోని పంజాబ్ యూనివర్సిటీలో చదివే సమయంలో విద్యార్థి నాయకుడు. ఇదే క్రమంలో గోల్డీ బ్రార్ పరిచయమై నేర సామ్రాజ్యంలోకి అడుగుపెట్టాడు. కాలేజీ గ్యాంగ్ వార్‌లో తన స్నేహితురాలిని సజీవ దహనం చేయడం.. లారెన్స్‌లో తీవ్ర కసిని పెంచింది. రాజస్థాన్‌లో కృష్ణ జింకలను చంపిన కేసులో నిందితుడైన సల్మాన్‌ఖాన్‌ను హత్య చేసేందుకు ప్రణాళిక వేయడం ద్వారా లారెన్స్ వార్తల్లోకెక్కాడు. ఇతడి గ్యాంగ్ కార్యకలాపాలు పంజాబ్, ఢిల్లీ, హరియాణా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్‌లకు విస్తరించాయి.

# రష్యా-ఉక్రెయిన్ వార్...మోడీ సలహా ఇదే!

న్యూఢిల్లీ,రష్యా-ఉక్రెయిన్ మధ్య యుద్ధం అవిరామంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య జోక్యం చేసుకుని సమస్యల పరిష్కారం దిశగా చర్యలు తీసుకునేవారు కరువయ్యారనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఈ సమయంలో ఇరు దేశాలతో సన్నిహిత సంబంధాలున్న భారత్ ఈ విషయంలో కీలక భూమిక పోషించబోతున్నట్లు తెలుస్తోంది. రష్యా-ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం ముగింపు లేనట్లుగా కొనసాగుతోన్న సంగతి తెలిసిందే. ఈ విషయంలో ఇరుదేశాలూ ప్రాణ, ఆస్థి నష్టాలు చవిచూస్తున్నాయి. అయితే ఉక్రెయిన్ బయటకు చెప్పుకుంటుంది.. రష్యా చెప్పుకోవడం లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో 16వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు రష్యా వెల్లిన మోడీ కీలక వ్యాఖ్యలు చేశారు. అవును... 16వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోడీ రష్యాలోని కజాన్ చేరుకున్నారు. ఈ సందర్భంగా మోడీకి సాదర స్వాగతం లభించింది. ఈ సందర్భంగా మోడీ సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తో ఆయా ద్వైపాక్షిక సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ విషయాలను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఇందులో భాగంగా... బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం సమావేశం కోసం అందమైన కజాన్ నగరాన్ని సందర్శించినందుకు సంతోషిస్తున్నట్లు తెలిపిన ప్రధాని మోడీ... రష్యాతో భారతదేశానికి చారిత్రాత్మక సంబంధాలు ఉన్నాయని తెలిపారు. ఈ సందర్భంగా... రష్యా-ఉక్రెయిన్ వివాదాన్ని ఉటంకిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందులో భాగంగా... వివాదాలకు శాంతియుత పరిష్కారాలను భారత్



విశ్వసిస్తుందని.. చర్చలతో అన్ని సమస్యలూ పరిష్కారం అవుతాయనేది తమ వైఖరి అని మోడీ అన్నారు. ఈ సందర్భంగా బ్రిక్స్ లో చేరతామనే ఇతర దేశాల కోరికతో కూటమి సక్సెస్ అవ్వడంపై సభ్యదేశాలకు శుభాకాంక్షలు చెప్పారు. కాగా.. "బ్రిక్స్" కూటమి 16వ శిఖరాగ్ర సదస్సు ప్రారంభమైంది. ఇందులో మోడీ, చైనా ప్రెసిడెంట్ జిన్ పింగ్ తో పాటు ఇతర నేతలు పాల్గొంటారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికాతో ఏర్పాటైన ఈ కూటమిని విస్తరించి.. ఈజిప్ట్, ఇరాన్, సౌదీ అరేబియా, ఇథియోపియా, యూఏఈ లకు సభ్యత్వం ఇచ్చారు. ఇలా కూటమిని విస్తరించిన తర్వాత జరుగుతున్న తొలి శిఖరాగ్ర సదస్సు ఇది!

# ఇసుకలో దళారీ రాజ్యం..నిర్మాణాలపై ఇసుక ధరల ప్రభావం



కరీంనగర్,కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినా...తెలంగాణలో ఇసుక విధానంలో మార్పు రాలేదు. దోచుకున్నవాడికి దోచుకున్నంత అన్న చందంగా ఇసుకను ఎత్తి పోస్తున్నారు. రీచ్ మొదలు ఎత్తి అమ్మనే వరకు వివిధ స్టేజీల్లో దళారులు దందాలు సాగిస్తున్నారు. అందినకాడికి దోచుకుంటున్నారు. దీంతో కొనుగోలు దారుపై భారం పెరుగుతోంది. నిర్మాణ రంగంపైనా ప్రభావం పడుతోంది. మరోవైపు ఇసుకరీచ్‌ల వద్ద కాంట్రాక్టర్‌లు లారీల నుంచి అధికంగా వసూలు చేస్తున్నారు. అక్కడ పనిచేసే పిఓలు సైతం ముక్కుపిండి మరీ వసూళ్లు చేస్తున్నారు. ఒక్కో లారీకి ఇసుకను ఎత్తడానికి అదనంగా రూ.6 వేలు లారీల యజమానులు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీనివల్ల ఇసుకను అధిక ధరకు అమ్మాల్సి వస్తుందని లారీల యజమానులు వాపోతున్నారు. ఇసుక, సిమెంట్ ధరలతో నిర్మాణ ధరల్లో కూడా భారీ పెరుగుదల కనిపిస్తోంది. దీంతో రియల్ ఎస్టేట్ రంగంపైనా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇసుకలో తలా ఓ చేయి వేసి దోచుకోవడంతో కొనుగోలు ధర రెట్టింపు అవుతోంది. ఇప్పటికే ఈ విషయమై టిజిఎండిసి అధికారులకు ఫిర్యాదు చేశామని వారు పేర్కొంటున్నారు. అయితే అక్రమాలపై ఫిర్యాదులు అందినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇసుక రీచ్‌ల వద్ద జరిగే దోపిడీతో తాము ఇబ్బందులు పడుతున్నామని లారీల యజమానులు వాపోతున్నారు. భద్రాద్రికొత్తగూడెం, ములుగు, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, భద్రాచలం, మంచిర్యాలలో ఈ దందా అధికంగా జరుగుతుందని లారీల యజమానులు వాపోతున్నారు. ఇసుక కోసం లారీల యజమానులు ఇసుక డిడిలను ఆన్‌లైన్‌లో కొనుగోలు చేస్తారు. 35 టన్నుల ఇసుకకు ప్రభుత్వానికి డిడిల రూపంలో రూ. 14,400లు, 32 టన్నుల ఇసుకకు రూ.13,100లు, 26 టన్నుల ఇసుకకు రూ.11,500లను లారీల యజమానులు చెల్లిస్తారు. అయితే ఇసుక డిడిలను కొనుగోలు చేసినప్పుడు ఏ రీచ్‌కు వెళ్లాలన్నది టిజిఎండిసి ఆ డిడిల్లో సూచిస్తుంది. ఆ డిడిలను తీసుకొని ఇసుక రీచ్‌ల వద్దకు లారీల యజమానులు వెళ్లినప్పుడు అక్కడ అదనంగా రూ.6 నుంచి రూ. 10 వేలు చెల్లిస్తేనే లారీల్లోకి ఇసుకను ఎత్తడం విశేషం. ఇలా అదనంగా డబ్బులను వసూళ్లు చేయడంతో ఒక్కో లారీ ఇసుకకు రీచ్‌ల నుంచి హైదరాబాద్‌కు తీసుకురావడానికి డీజిల్‌తో కలిపి రూ.25 నుంచి రూ.30 వేలు ఖర్చు అవుతుందని దీనివల్ల ఎక్కువ ధరకు ఇసుకను అమ్మాల్సి వస్తుందని లారీల యజమానులు వాపోతున్నారు. ఇదంతా నిర్మాణ ఖర్చు పెరగడానికి కారణం అవుతోంది. దీంతోపాటు భద్రాద్రికొత్తగూడెం, ములుగు, పెద్దపల్లి, కరీంనగర్, జయశంకర్ భూపాల పల్లి, భద్రాచలం, మంచిర్యాలతో పాటు మరికొన్ని రీచ్‌ల్లో కాంట్రాక్టర్‌లు, పిఓలు ఎక్స్‌ట్రా బకెట్ పేరుతో ఒక్కో బకెట్‌కు రూ.2 వేలు తీసుకుంటున్నారని, ఇది వద్దంటే ఇసుకను లారీల్లో వేయడానికి వారు ముందుకు రావడం లేదని లారీల యజమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మాములుగా 35 టన్నుల ఇసుకకు ప్రభుత్వానికి డిడిల రూపంలో రూ.14, 400లు చెల్లించి రీచ్‌ల వద్దకు వచ్చినప్పుడు లారీల్లోకి ఇసుకను ఎత్తడానికి సపరేట్‌గా రూ. 4వేలు, పట్టాదారుడికి రూ.1,000లు, జేసిబితో ఇసుకను ఎత్తినందుకు రూ.500లు, సీరియల్ నెంబర్ రాసినందుకు రూ.100, కాంటకు రూ.100, వే బిల్లుకు రూ.100ను లారీల యజమానులు చెల్లిస్తున్నా రు. వీటితో పాటు అదనంగా ప్రతి లారీలో రెండు నుంచి మూడు బకెట్‌ల ఇసుకను ఒక్కో బకెట్ ఇసుకకు రూ. 2 వేలు మూడు బకెట్‌లను రూ.6 వేలను కచ్చితంగా చెల్లిస్తేనే లారీలను ఆ రీచ్‌ల నుంచి కాంట్రాక్టర్ బయటకు పంపిస్తున్నారు. యితే కాంట్రాక్టర్‌లు, పిఓలు అదనపు బకెట్‌ల పేరుతో తమను వేధిస్తున్నారని దీనివల్ల ఆర్‌టిఓలు, పోలీసులు అధికలోడ్‌తో వెళ్లే తమ లారీలను సీజ్ చేస్తున్నారని లారీల యజమానులు వాపోతున్నారు. దీంతోపాటు ప్రతిరీచ్‌ల వద్ద పనిచేపే పిఓలు ప్రతిరోజులు లక్ష రూపాయల వరకు సంపాదిస్తున్నారని వారి చెప్పింది వినకుంటే స్థానికంగా తమ లారీలను తిరగనివ్వడం లేదని లారీల యజమానులు వాపోతున్నారు. ఇప్పటికే పలు రీచ్‌ల వద్ద ఉన్న పిఓలపై టిజిఎండిసి ఫిర్యాదులు అందుతున్న చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దళారీ వ్యవస్థను అరికట్టాలని కోరతున్నారు.

# రావాలి జగన్ అంటున్న అయ్యన్న!



అమరావతి,ఏపీ శాసనసభ బడ్జెట్ సమావేశాలు నవంబర్ మొదటి వారంలో జరుగుతాయని ప్రచారం సాగుతోంది. ఈసారి కనీసంగా వారం నుంచి పది రోజుల పాటు సమావేశాలు జరగవచ్చు అని అంటున్నారు. ఈ సమావేశాలలో పూర్తి స్థాయి బడ్జెట్ ని ప్రవేశపెడతారు అని తెలుస్తోంది. అదే విధంగా అమరావతి పోలవరం ప్రాజెక్టులకు సంబంధించి కీలక ప్రకటనలు తీర్మానాలు ఉంటాయి. ఈ బడ్జెట్ సెషన్ ని అత్యంత కీలకంగా టీడీపీ కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఈ బడ్జెట్ సెషన్ కి వైసీపీ హాజరవుతుందా అన్న చర్చ అయితే ఉంది. ఇప్పటికి శాసనసభ పలు మార్లు సమావేశం అయినా వైసీపీ పెద్దగా హాజరైంది లేదు. మొదటిసారి ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగినపుడు జగన్ సభకు వచ్చి ప్రమాణం చేసి వెళ్ళిపోయారు. ఆ తరువాత సభ స్పీకర్ ఎన్నిక కోసం సమావేశమై అయిదు రోజుల పాటు సాగింది. ఆ సమావేశాలకు వైసీపీ గైర్ హాజరు అయింది. ఇపుడు కూటమి ప్రభుత్వం వచ్చాక ఎక్కువ రోజులు సభ జరపనున్నారు. మరి జగన్ వస్తారా అన్నదే అందరి ఆలోచనలలో ఉంది. ఎందుకంటే బడ్జెట్ సెషన్ చాలా కీలకమైనది. అదే సమయంలో గత నాలుగు నెలల కూటమి పాలనలో కొంత మంచి జరిగింది, కొన్ని విమర్శలు ఉన్నాయి. సహజంగానే విపక్షానికి ఇది ఆయుధంగా ఉంటుంది. దాంతో విపక్షం వస్తే సభలో చర్చలో రచ్చో ఏదో ఒకటి జరుగుతుంది. కానీ విపక్షం వస్తుందా అన్నదే ఇక్కడ కీలకం. ఇక సంక్షేమ పథకాల విషయంలో హామీలు తప్ప ఏమీ చేయలేదని వైసీపీ విమర్శిస్తోంది. మరి బడ్జెట్ లో ఏ ఏ పథకాలకు ఎంత నిధులు కేటాయిస్తారు వాటిని ఎప్పటి నుంచి అమలు చేస్తారు అన్నది కూడా ఈ బడ్జెట్ సెషన్ లో చర్చకు ఆస్కారం ఉంది. దానిని లేవనెత్తాల్సింది విపక్షమే. సభలో ఉన్న నాలుగు పార్టీలలో మూడు పార్టీలు కూటమి ప్రభుత్వంలోనే ఉన్నాయి. కాబట్టి విపక్ష పాత్ర నిర్వహిస్తూ ప్రజా గొంతుకను వినిపించాల్సిన బాధ్యత అయితే వైసీపీ మీద ఉంది. మరి ఈ నేపథ్యంలో జగన్ మీదనే అంతా చూపు పెడుతున్నారు ఇదిలా ఉంటే స్పీకర్ అయ్యన్నపాత్రుడు కూడా జగన్ అసెంబ్లీకి రావాలని కోరారు. ఆయన తన సొంత నియోజకవర్గం నర్సీపట్నంలో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ జగన్ అసెంబ్లీకి వస్తే బాగుంటుందని అన్నారు. అదే సమయంలో ఆయన కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. సభకు వస్తే స్పీకర్ హెూదాలో తనకు జగన్ నమస్కరించాల్సి ఉంటుందని భావించే రావడం లేదు అని అన్నారు. అయితే విపక్షం సభకు రావాలనే తన ఆలోచన అని ఆయన అన్నారు. ప్రధాన ప్రతిపక్ష హెూదా అయితే వైసీపీకి ఇచ్చేది లేదని ఇప్పటికే స్పీకర్ స్పష్టం చేశారు. దానికి తగిన సంఖ్యాబలం వైసీపీ తెచ్చుకోలేదు కాబట్టే నిబంధనల ప్రకారమే వెళ్తామని అంటున్నారు. మరి అదే కనుక జరిగితే సాధారణ సభ్యుడిగా సభకు జగన్ హాజరైతే ఆయనకు మైకు ఇస్తారన్న గ్యారంటీ ఏముందని వైసీపీ అంటోంది. మొత్తానికి చూస్తే జగన్ ని సాధారణ సభ్యుడిగానే చూస్తామని ప్రభుత్వం చెబుతూంటే తమ గొంతు నొక్కే సభకు తాము వెళ్ళి కూడా ఏమిటి లాభం అన్నది విపక్షం వైఖరిగా ఉంది. కీలకమైన బడ్జెట్ సెషన్ కి కూడా వైసీపీ గైర్ హాజరు అయితే మాత్రం ఆ పార్టీ వైఖరి ఏమిటి అన్నది ఫుల్ క్లారిటీ వచ్చే అవకాశం ఉంది అని అంటున్నారు.

### వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిన జగన్

ఏలూరు,జగన్ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేసిందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. గత ఐదు సంవత్సరాలు వ్యవస్థలను వ్యక్తిగత అవసరాలకు, వారి స్వలాభం కోసం ఉపయోగించుకున్నారని ఆరోపించారు. రూ. 1674 కోట్లు బకాయిలు రైతులకు వైసీపీ ప్రభుత్వం చెల్లించలేదని మండిపడ్డారు. మంగళవారం ఏలూరులో మంత్రి నాదెండ్ల ఈ సందర్భంగా మంత్రి మనోహర్ మాట్లాడుతూ... రూ. 13 లక్షల కోట్లు అప్పులు చేసి వెళ్లిపోయారని ఆరోపించారు. ధాన్యాన్ని రైస్ మిల్లర్లకు అప్పగించిన 48 గంటల్లోపు రైతుల అకౌంట్లో డబ్బులు పడతాయని స్పష్టం చేశారు. మొదటి రకం ధాన్యానికి మద్దతు ధర రూ. 2350లకు కొంటామని తెలిపారు. రైతులకు నచ్చిన రైస్ మిల్లులో ధాన్యాన్ని అమ్ముకోవచ్చని వెల్లడించారు. గోనెసంచులు హమాలి ట్రాన్స్‌పోర్ట్ ప్రభుత్వమే భరించి రైతుల ఖాతాలో డబ్బులు వేస్తుందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

# ఎన్‌ఐసి చేతికి ధరణి..

హైదరాబాద్,ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతల ను ఎన్‌ఐసికి (నేషనల్ ఇన్‌ఫ్రాటిక్ సెంటర్‌కు) అప్పగిస్తూ రాష్ట్ర ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది. డి సెంబర్ ఒకటో తేదీ నుంచి ఎన్‌ఐ సి ఈ బాధ్యతలు చేపట్టనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వు లు జారీ చేసింది. ఇప్పటివరకు టె రాసిస్ ప్రైవేటు సంస్థ నిర్వహిస్తు న్న ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ ఇ న్ఫర్మేటిక్ సెంటర్- (ఎన్‌ఐసికి) రాష్ట్ర ప్రభుత్వం అ ప్పగించినట్టయ్యింది. మూడేళ్ల పాటు ధరణి పోర్ట ల్ నిర్వహణకు సంబంధించి ఎన్‌ఐసితో ఒప్పం దం చేసుకున్నట్లు ప్రభుత్వం ఈ ఉత్తర్వుల్లో పే ర్కొంది. ఎన్‌ఐసి పనితీరు బాగుంటే మరో రెండే ళ్లు నిర్వహణ బాధ్యతలను పొడిగించనున్నట్లు ప్ర భుత్వం ఈ ఉత్తర్వుల్లో తెలిపింది. టెరాసిస్ నుంచి ఎన్‌ఐసికి ఈ బాధ్యతలను అప్పగించడం ద్వారా దాదాపు కోటి రూపాయల ని ర్వహణ భారం తగ్గుతుందని రె వెన్యూ అధికారులు వెల్లడించా రు. అయితే ధరణి పోర్టల్‌కు సంబంధించి సాంకేతిక అంశాలను పూర్తిస్థాయిలో ఎన్‌ఐసికి బదలాయించేందుకు నవంబర్ 30వ తేదీ వరకు ప్రభుత్వం గ డువు విధించింది. అయితే టె ర్రాసిస్ నుంచి ఎన్‌ఐసీకి డేటా, మెయింటెనెన్స్ వర్క్ ట్రాన్స్‌ఫర్ చేసేందుకు ఒక నెల గడువు ఇచ్చింది. ఎన్‌ఐసీకి డేటా ట్రాన్స్‌ఫర్ చేసేందుకు టెరాసిస్ సంస్థ సిబ్బంది ఎన్‌ఐసికి సహకరించాలని రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటర్ నవీన్ మిట్టల్ ఈ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

2018లో ఐఎల్‌ఎఫ్‌ఎస్ టెక్నాలజీస్ లిమిటెడ్ (టెర్రాసిస్)కు బాధ్యతలు 2018 మార్చి 29వ తేదీన జీఓ 65 ద్వారా అప్పటి ప్రభుత్వం ఐఎల్‌ఎఫ్‌ఎస్ టెక్నాలజీస్ లిమిటెడ్ (టెర్రాసిస్)కు ధరణి బాధ్యతలను అప్పగించారు. ఈ మధ్య కాలంలోనే ఐఎల్‌ఎఫ్‌ఎస్ నుంచి టెర్రాసిస్‌గా రూపాంతరం చెందింది. ప్రభుత్వ ఆదేశాలతో రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, ఐటీఈసీ, టిజిటిఎస్ వెబ్ సైట్‌ల బాధ్యతలను టెర్రాసిస్ చేపట్టింది. తొలుత 2018 ఏప్రిల్ 20




నుంచి ధరణి పోర్టల్‌ను రూపొందించడంతో తదితర బాధ్యతలను ఈ సంస్థ చేపట్టింది. ఆ తర్వాత 2020 అక్టోబర్ 29వ తేదీ నుంచి 2023 అక్టోబర్ 29వ తేదీ వరకు మూడేండ్ల పాటు ఆ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారు. గతేడాది కాలపరిమితి ముగిసినా మరో ఏడాది పాటు అప్పటి ప్రభుత్వం కాంట్రాక్టును పొడిగించింది. ఈ నెల 29వ తేదీన టెర్రాసిస్ కాలపరిమితి ముగుస్తుండడంతో ధరణి బాధ్యతలు ఏ కంపెనీకి అప్పగించాలన్న దానిపై ధరణి కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. ఇందులో భాగంగా ధరణి కమిటీ ఎన్‌ఐసీ, సీజీజీ, టిజి ఆన్‌లైన్‌ల పనితీరును పరిశీలించింది. ఆఖరికు ఎన్‌ఐసికి ఈ బాధ్యతలను అప్పగించాలని ధరణి కమిటీ ప్రభుత్వానికి నివేదించింది. ల్యాండ్ రికార్డ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాంలో ఎన్‌ఐసీకి సుదీర్ఘ అనుభవం ఉంది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం మూడేళ్ల పాటు ఈ బాధ్యతలను అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈనెల 25వ తేదీన ధరణి ప్రాజెక్టును ఎన్‌ఐసికి అప్పగించే అంశంపై రెవెన్యూ అధికారులు, ధరణి కమిటీ సభ్యులు, టిజిటిఎస్, ఎన్‌ఐసీ, టెర్రాసిస్ టెక్నాలజీ లిమిటెడ్ ప్రతినిధులు సమావేశం కానున్నారు.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com